

ఈనాడు
ఆదివారం
17 ఆగస్టు 2025
తో మాలీ నుంచి 'కూలీ'...
రజినీ@50
వివాహ బంధాల
కమనీయ వస్త్ర ప్రపంచం
CMR రాయల్ వెడ్డింగ్ కలెక్షన్స్
కంచి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ, బెనారస్ ఇంకా మరెన్నో
CMR శ్రావణం సూపర్ సేల్
శ్రావణంలోనే కనివిని ఎరుగని
తగ్గింపు ధరలు
CMR SHOPPING MALL
The joy of life
1+1 మరియు కాంబో ఆఫర్స్
*Conditions Apply
ఏలూరు 7670901431 | విజయవాడ 91333 87124 | భీమవరం 7670901423 | మచిలీపట్నం 9533315353 | గుంటూరు 7670901440 | గుడివాడ 9177006936 | ఒంగోలు 7670900577 | మార్కాపురం 7799918628
FOLLOW US ON /cmrshoppingmallindia /cmrshoppingmall



శుభ్‌మన్ గిల్...
అన్ని ఫార్మాట్లకూ సరిపోయే ఆటతీరుతో.. సవాళ్లను దాటి అలరించే షాట్లతో.. 'విరాట్ తర్వాత ఎవరు?' అనే ప్రశ్నకు తానే సమాధానమంటూ నిరూపించుకున్నాడీ పంజాబీ యువ సంచలనం. తాజా ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో అద్భుత బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్‌గానూ అదరగొట్టాడు. అతడి ముచ్చట్లే ఇవి..


నన్ను అవుట్ చేస్తే... రూ.100 ఇస్తానన్నారు నాన్న!

అది నాన్న కల

మా నాన్నకు క్రికెట్ అంటే ఇష్టం. నిజానికి ఆయన క్రికెటర్ కావాలనుకున్నారు. కానీ, కుటుంబ పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు. అయితే, తన కలను నా ద్వారా నెరవేర్చుకోవాలని అనుకున్నారు. ఒకసారి మ్యాచ్ చూసేందుకు నేనూ నాన్నా కలిసి మొహాలీకి వెళ్లాం. అక్కడ స్టేడియం పరిసరాల్లో క్రికెట్ వాతావరణం చూసి.. నేను క్రికెటర్‌గా ఎదగాలంటే అక్కడైతేనే బాగుంటుందనుకున్నారు నాన్న. అలా మేమంతా మొహాలీకి వెళ్లిపోయాం. చదువుకుంటూనే అక్కడి క్రికెట్ అసోసియేషన్ అకాడమీలో శిక్షణలో చేరా. రోజూ ఉదయం నాలుగింటికే అకాడమీకి వెళ్లేవాడిని. రెండు గంటల ప్రాక్టీస్ తర్వాత స్కూల్.. అక్కణ్నుంచి వచ్చాక మధ్యాహ్నం నాన్న పర్యవేక్షణలో ఓ గంట.. సాయంత్రం మళ్లీ అకాడమీలో మరో మూడు గంటలు ప్రాక్టీస్ చేసేవాడిని.

పెద్దవాళ్లతోనే ఆడేవాణ్ని

పదకొండేళ్లకే అండర్-16కి, పదహారేళ్లకే అండర్-19కి.. ఇలా ఎప్పుడూ నాకంటే పెద్ద వయసు వాళ్లతోనే ఆడేవాణ్ని. 2018లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలిచా. అప్పుడే ఐపీఎల్ వేలం జరగ్గా.. కోల్‌కతా జట్టు నన్ను రూ.1.8 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ తర్వాత 2019లో ఇండియా వన్డే జట్టులోకీ, 2020 చివర్లో టెస్టుల్లోకీ ఎంపికయ్యా.



కుటుంబం

గెలుపులో మాకంటే ఎక్కువ సంతోషపడేదీ, ఓటమిలో మాకంటే ఎక్కువ బాధపడేదీ మా అమ్మే. ఇక మా అక్క నా బెస్ట్ ఫ్రెండ్. తనకు నా సీక్రెట్లన్నీ తెలుసు.

ముద్దు పేర్లు

ఇంట్లోవాళ్లు 'కాకా' (పంజాబీలో 'బేబీ' అని అర్థం. తెలుగులో బుజ్జీ, చిన్నీ అంటుంటారు కదా, అలా అన్నమాట) అనీ, అభిమానులు 'ప్రిన్స్' అనీ పిలుస్తుంటారు.

★ బెస్ట్ ఫ్రెండ్ : ఇషాన్ కిషన్.

★ మెచ్చే ఫుడ్ : సూఫీ ఆలూ పరాఠా.

డబ్బులు పోకూడదని...

నా చిన్నప్పుడు బాల్, బ్యాట్ తప్ప వేరే బొమ్మలేవీ అడిగేవాడిని కాదు. నిద్రపోయేటప్పుడూ వాటిని నా పక్కనే ఉంచుకునేవాడిని. ఆ ఆసక్తిని చూసే నాన్న మా పొలంలో నాకోసం ప్రత్యేకంగా గ్రౌండ్‌ను సిద్ధం చేయించారు. ఊళ్లోని పిల్లల్ని అక్కడికి పిలిచి నాకు బౌలింగ్ చేయమనేవారు. నన్ను అవుట్ చేస్తే రూ.100 ఇస్తామనేవారు. అప్పుడు డబ్బులు పోకూడదని వికెట్ కాపాడుకుంటూ జాగ్రత్తగా ఆడిన నైపుణ్యమే.. నన్ను ఇక్కడిదాకా తీసుకువచ్చింది. అందుకే నాన్నే నా తొలి గురువు అని చెబుతుంటా. ఇప్పటికీ మ్యాచ్ కాగానే ముందుగా నాన్నకే ఫోన్ చేస్తా.



జెర్సీ నంబర్.. 77

అందరూ సింగిల్ డిజిట్ నంబర్ ఉన్న జెర్సీలు కావాలంటుంటే, నువ్వెందుకు డబుల్ డిజిట్ తీసుకున్నావంటూ చాలా మంది నన్ను అడుగుతుంటారు. అండర్-19 వరల్డ్ కప్ ఆడుతున్నప్పుడు నంబర్ 7 జెర్సీ కావాలని అడిగాను. కానీ, అప్పటికే దాన్ని వేరేవాళ్లు తీసుకోవడంతో నేను 77 తీసుకున్నా. మరి అందులో ఏడు అంకెలు రెండున్నాయి కదా!

మరింత బలం వచ్చింది..

మొదట్నుంచీ నాది అందరినీ కలుపుకుని పోయే తత్వం. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు రెండు దఫాలు కెప్టెన్‌గా పనిచేసిన అనుభవమూ నాకు కలిసొచ్చింది. కెప్టెన్‌గా నా పేరును ప్రకటించగానే.. విదేశాల్లో అసలు ఏ రికార్డూ లేకుండా ఎలా ఎంపిక చేశారని కొందరు విమర్శించారు. అయితే, సారథిగా తొలి టెస్టులోనే మెరుగైన ప్రదర్శన చేయడంతో నా సామర్థ్యంపైన అందరికీ నమ్మకం ఏర్పడింది. అంతేకాదు.. దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి- వాళ్లిద్దరి నైపుణ్యాలూ నాలో ఉన్నాయని చెబుతుండటం నాకు మరింత బలాన్నిచ్చింది.

లోపల

మంచిమాట

నిన్ను చూసి చిరునవ్వులు చిందించేవారంతా నిన్ను గుండెల్లో పెట్టుకునే స్నేహితులనుకోకు.

మీకు తెలుసా

న్యూ మెక్సికోలోని రూట్ 66 దారిలో ఉన్న అల్‌బుకెర్క్- టిజెరాస్ ప్రాంతాల మధ్య గంటకు 45 మైళ్లకన్నా వేగంగా వెళ్తే 'అమెరికా ద బ్యూటిఫుల్' అనే పాట వినిపిస్తుందట. ఆ రోడ్డు మీద ఏర్పాటు చేసిన ఫలకాలను ప్రత్యేకంగా రూపొందించడంవల్ల కారు చక్రాలు వాటి మీద వెళ్లిన స్పీడుని బట్టి అవి వైబ్రేట్ అయ్యి పాటను ప్లే చేస్తాయి.



అంతేగా!

ఒకప్పుడు పెద్దవాళ్ళను గౌరవించడం అంటే... కనీసం లేచి నిల్చోవడం. కానీ ఇప్పుడు... చెవిలో పెట్టుకున్న ఇయర్‌ఫోన్స్ తీస్తే వాళ్ళను గౌరవించినట్టే.

వ్రతాలూ నోములూ చేస్తున్నప్పుడు... సంకల్పం చెప్పడం నుంచి తోరం కట్టుకోవడం వరకూ ఎన్నో క్రతువులు ఉంటాయి. వాటిని నిర్వర్తించే క్రమంలో ఎదురయ్యే కొన్ని సందేహాలను నివృత్తి చేసుకుందాం...

భార్య పూజాఫలం భర్తకు లభిస్తుందా?



◆ **సంకల్పం చెప్పాకే ఏ పూజనైనా ప్రారంభించాలని అంటారు. అసలు, రోజూ సంకల్పం చెప్పుకోవడం తప్పనిసరా?**

☛ వికల్పం అంటే... ఆటంకం. మనం చేసే పనికి విఘ్నం కలగడం అన్నమాట. అందుకే, ఏదైనా పూజను ప్రారంభించే ముందు ఏ అడ్డంకులూ రాకుండా... తలపెట్టిన పని నిర్విఘ్నంగా సాగాలని త్రికరణశుద్ధిగా సంకల్పించడమే... సంకల్పం. కల్పం అంటే కాలం, విధానం, పద్ధతి అనే అర్థాలూ ఉన్నాయి. సంకల్పాల్లో... నిత్య సంకల్పం, లఘు సంకల్పం, మహా సంకల్పం ప్రసిద్ధం. నిత్య సంకల్పంలో మళ్లీ మూడు అంశాలు ఉంటాయి. అవే... దేశ, కాల, స్థల స్మరణలు. శుభే శోభనే ముహూర్తే, ఆద్య బ్రాహ్మణ ద్వితీయేయ... అంటూ ప్రారంభం అవుతుంది. ఇందులో తిథి, వార నక్షత్రాల ప్రస్తావనలు ఉంటాయి కనుక, వాటిని చెప్పడం తప్పనిసరి. మనం ఉన్న భౌగోళిక ఉనికిని బట్టి ఆ రోజున ఉన్న తిథి, వార నక్షత్రాలను చెప్పుకుంటే సరిపోతుంది. అది తప్పనిసరి కూడానూ. నిత్య సంకల్పంలో వ్యక్తిగత వివరాలతో పన్లేదు. అంటే... గోత్రోద్భవస్య, నామధేయస్య, ధర్మపత్నీ సమేతస్య.. వంటివి చెప్పకపోయినా తప్పేం కాదు. అలాగే లఘు సంకల్పాన్ని ప్రత్యేక పూజల్లోనే చెబుతారు. ఇందులో గోత్రం, కుటుంబసభ్యుల నామాలూ ఉంటాయి. పెళ్లి, ఉపనయనం వంటి విశేష సమయాల్లో మహాసంకల్పాన్ని చెప్పిస్తారు.



గురుముఖం

◆ **భార్య నోముల పుణ్యఫలం భర్తకు కూడా లభిస్తుందా?**

☛ తప్పకుండా లభిస్తుంది. రోజుకు పగలూ రాత్రీ ఉన్నట్టే... నాణేనికి బొమ్మా, బొరుసూ ఉన్నట్టే... ఇంటికి భార్యాభర్తలు. ఇద్దరూ సమ భాగస్వామ్యంతో నిర్వహించేదే ఆదర్శవంతమైన గృహం. భార్య గృహిణి అయితే భర్త గృహస్థు. భార్య చేసే వంట కూడా ఓ రకమైన పూజే అంటుంది ధర్మశాస్త్రం. భర్త దేవతారాధన చేస్తే, భార్య అందుకు కావలసిన సకల సంభారాలనూ, నైవేద్యాలనూ సమకూర్చుతుంది. అదీ పూజలో భాగమే అవుతుంది. భార్య చేసే పూజల్లో వ్రతాలూ, తులసి ఆరాధనా, నోములూ అధికం. తులసీదేవి పూజలతో జలంధరుడూ, మండోదరి పూజలతో రావణుడూ పుణ్య బలాన్ని పెంచుకున్న కథలు తెలిసినవే. అలా... ఇల్లాలు నిర్వహించే పూజలతో ఇంటిల్లిపాదికీ రక్షణ ఉంటుంది. సావిత్రి పూజాఫలం సత్యవంతుడిని బతికించింది. చారుమతి నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం ఇంటిల్లిపాదికీ ఆనందం కలిగించిన విషయమూ తెలిసిందే.



◆ **ఉద్వాసన అంటే ఏమిటి? నిత్యపూజల్లో ఉద్వాసన ప్రస్తావన ఉంటుందా?**

☛ నిత్యపూజలో ఉద్వాసన ఉండదు. కొన్ని ప్రత్యేక పూజలూ, వ్రతాల్లో మాత్రమే ఉద్వాసన చెబుతారు. మనం ఆహ్వానించిన దైవాన్ని... భక్తితో అర్చించిన అనంతరం, మర్యాదపూర్వకంగా 'వెళ్లిరండి. మీ రాక మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. వీలు చూసుకుని మళ్లీ మా ఇంటికి రండి' అని చెప్పడమే ఉద్వాసన ఉద్దేశం. ఉద్వాసన చెప్పిన కాసేపటి తర్వాత... వ్రత మంటపాన్నీ, పూజా వేదికనూ ఎప్పటిలానే సర్దుకోవచ్చు.

◆ **ప్రత్యేకమైన పూజలూ వ్రతాలూ చేస్తున్నప్పుడు చేతికి తోరం కట్టుకోవాలని అంటారు. అసలు ఈ తోరధారణ వెనుక ఉద్దేశం ఏమిటి?**

☛ తోరాన్ని ధరించడం వల్ల ఆయా పూజలూ వ్రతాల వల్ల మంగళం కలుగుతుందని విశ్వాసం. మనకు సకల శుభాలూ కలగాలని ముంగిలికీ, ప్రధాన ద్వారానికీ తోరణం కడతాం. అలాగే వ్రతాల సమయంలో చేతికి తోరం కట్టుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని నమ్మకం. తోరానికి 'రక్ష' అనే పర్యాయపదమూ ఉంది. అయితే, ఈ తోరాన్ని ఒక్కో వ్రతానికి ఒక్కో విధానంలో కట్టుకోవాల్సి ఉంటుంది. సత్యనారాయణస్వామి వ్రతంలో దంపతులకు లేదా వ్రతం చేసేవారికి అర్చకులే కడతారు. కేదార వ్రతంలో భర్త, భార్య చేతికి కట్టాల్సి ఉంటుంది. గణపతిపూజ, నాగులచవితి... తదితర సందర్భాల్లో తల్లిదండ్రులు పిల్లలకు కట్టాలి. వరలక్ష్మీ వ్రతంలో తోటి మహిళ వ్రతం ఆచరిస్తున్న మహిళకు కట్టాలి. కొన్నిసార్లు తోరాన్ని ఏ చేతికి కట్టుకోవాలనే సందేహమూ కలుగుతుంది. వివాహితకు తండ్రి ఈ రక్షను కుడిచేతికి కట్టాలి. అదే భర్త అయితే, ఎడమ చేతికి కట్టాలని శాస్త్రాలు చెబుతున్నాయి. తోరం.. భగవంతుడికీ, భక్తులకూ అనుసంధానం కూడా.



◆ **పూజలో దేవుడికి దూదితో చేసిన వస్త్రాన్ని సమర్పిస్తారెందుకు?**

☛ వస్త్ర సమర్పణ దేవుడి అలంకరణలో ముఖ్యమైంది. షోడశ ఉపచారాల్లో స్నాన సేవ అనంతరం వస్త్రాన్ని సమర్పిస్తాం. (దూదితో చేస్తారు కనుక, శాస్త్రం ప్రకారం వస్త్రం అంటాం కానీ, ఇక్కడ వస్త్రం అంటే బట్ట కాదు) నిండుమనసుతో మనమే దూదిని దారంలా తయారుచేసి, తెగిపోకుండా నెయ్యి కలిపిన పసుపు కుంకుమల్ని రాసి వస్త్రాన్ని తయారుచేయొచ్చు. అయితే, ఒకటి కాకుండా రెండు చిన్న చిన్నవిగా చేసి సమర్పించాలి. పూజావిధిలో 'వస్త్రయుగ్మం సమర్పయామి' అని ఉంటుంది. యుగ్మం అంటే రెండు అని అర్థం.

– ఆచార్య కాకునూరి సూర్యనారాయణమూర్తి



కదంబ పుష్పాలను సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపంగా భావిస్తారు. శ్రావణమాసపు పూజలూ, వ్రతాల్లో వీటిని విరివిగా వాడతారు. కదంబాలు జగన్మాతకూ ఇష్టమైనవే. కాబట్టే, 'కదంబ వనవాసినీ, కదంబ కుసుమ ప్రియా' అంటూ లలితా సహస్రనామం ఆ తల్లిని స్తుతిస్తుంది. పురాణాల్లోనూ ఈ మహావృక్షానికి సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. ఔషధ మొక్కగానూ కదంబానికి ఎంతో పేరు. ఆసక్తికరమైన ఆ వివరాల్లోకి వెళితే...

కదంబ పుష్పాలు... లక్ష్మీ నివాసాలు!

ఒక్క బిల్వదళంతో పూజించినా... పొంగిపోతాడు ఆ శివయ్య! చిన్న తులసీదళం సమర్పించగానే... పరవశించిపోతాడు శ్రీమహావిష్ణువు! ఇలా ఆయా దేవతలకు ఇష్టమైన పుష్పాలూ, పత్రాలతో నిత్యం పూజలు చేస్తుంటాం. అలాగే, ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే కదంబం పూలంటే అమ్మవారికి ఎంతో ప్రీతి. తెల్లని తెలుపుతో చూడముచ్చటగా ఉంటాయివి. మొగ్గగా ఉన్నప్పుడు ఆకుపచ్చని బంతుల రూపంలో ఆకట్టుకుంటాయి. క్రమంగా పసుపు పచ్చగా మారిపోతాయి. చివరగా, చిన్నచిన్న తెల్లని రేకలతో పూబంతిలా కనువిందు చేస్తాయి. ఆకారమే కాదు, ఆ సువాసనలూ ప్రత్యేకమే. వానాకాలంలో విరగబూస్తూ... లక్ష్మీదేవి పూజల్లో భాగం అవుతుంటాయి. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో 'కదంబోత్సవం' పేరుతో ఈ వృక్షానికి ప్రత్యేక పూజలూ జరుపుతుంటారు. పురాణాల్లో 'కడిమి, రుద్రాక్షాంబ, కృష్ణప్రియ'... తదితర పేర్లతో ఈ చెట్టు ప్రస్తావన కనిపిస్తుంది.



పురాణ కథలు...

కదంబ వృక్షాన్ని దక్షిణాదిన పార్వతీదేవి స్వరూపంగా చెబుతారు. దీని వెనక ఓ ఆసక్తికరమైన కథ ప్రాచుర్యంలో ఉంది. గార్ధభాసురుడు అనే రాక్షసుడు ఘోర తపస్సు చేసి మనుషులతోకానీ జంతువులతోకానీ తనకు మరణం లేకుండా పరమేశ్వరుడి వరం పొందాడట. ఆ గర్వంతో దేవలోకం వరకూ వెళ్లి ఇంద్రుడిపైన దండెత్తాడట. ఆ అసురుడి ఆట కట్టించడానికి విష్ణుమూర్తి- మోహినీ రూపంలో గార్ధభాసురుని వనానికి వెళ్లాడు. అందమైన అమ్మాయి రూపంలో విష్ణువుకి సాయంగా బయల్దేరింది పార్వతీదేవి. ఆ అందానికి ముగ్ధులైన రాక్షసులు ఆమెను మోహిస్తారు. మరోవైపు, మోహినీ అవతారంలో ఉన్న విష్ణుమూర్తి పట్ల ఆకర్షితుడై... నీడలా వెంబడిస్తాడు గార్ధభాసురుడు. దీంతో సగం తోడేలూ, సగం మనిషి అవతారమెత్తి ఆ రాక్షసుడిని సంహరిస్తాడు విష్ణువు. అప్పుడే పార్వతీదేవి కదంబ వృక్షంగా మారి అగ్నిజ్వాలలతో అసురసైన్యాన్ని వధిస్తుంది. ఉత్తరాదిన దీనికే కృష్ణ వృక్షం అని పేరు. రాధాకృష్ణుల ఆటపాటలన్నీ ఈ కదంబ వృక్షం కిందే జరిగాయంటారు.

ఎన్ని ఉపయోగాలో...

ఈ పవిత్ర వృక్షానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ చెట్టు కలపను తేలికపాటి ఫర్నిచర్ తయారీలో వాడతారు. పరిమళాలు వెదజల్లే కదంబ పూలతో అత్తర్లనీ, రకరకాల సౌందర్యోత్పత్తుల్నీ తయారుచేస్తారు. పువ్వులూ, ఆకులూ, బెరడూ ఆయుర్వేద ఔషధాల తయారీలో పనికొస్తాయి. ఇందులోని 'క్లోరోజెనిక్ ఆమ్లం' కాలేయ వ్యాధుల్ని నయం చేస్తుందట. కదంబ కషాయం విరేచనాల్ని అరికడుతుంది. కదంబ ఆకులూ బెరడూ... నొప్పినీ, మచ్చల్నీ తగ్గిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో, కొలెస్ట్రాల్‌ని నియంత్రించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది కదంబం. రక్తంలో చక్కెర స్థాయుల్ని కూడా అదుపు చేయగలదని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంట్లో రొమ్ము, పెద్దపేగు క్యాన్సర్ కారక కణాల పెరుగుదలను నిరోధించే శక్తి ఉందట.

కొత్త రకాలు...

తక్కువ నీటితో అడవుల్లోనూ, పెరట్లోనూ పెరిగే ఈ ఎత్తయిన వృక్షం... ఇప్పుడు నాలుగైదు అడుగుల ఎత్తులోనూ లభిస్తోంది. దీంతో బాల్కనీలోనూ పెంచుకోవచ్చు. తెలుపుతోపాటు ఎరుపు, పసుపు వర్ణాల కదంబం పూల మొక్కలూ దొరుకుతున్నాయి. కాస్తంత సమయం కేటాయించగలిగితే, నిత్యం అమ్మవారిని అందమైన కదంబాలతో అలంకరించుకోవచ్చు. ★

అవీ ఇవీ



అది... ఏఐ అంగన్వాడి



ఆరేళ్లలోపున్న అక్కడి పిల్లలు... 'ఏఐ' బోర్డుతో అక్షరాలు దిద్దుకుంటున్నారు. దిద్దడంలో తప్పులొస్తే... ఏఐ వాటిని సరిచేసి... ఎలా రాయాలో చెబుతోంది. బొమ్మలు గీయడమూ నేర్పుతోంది. అక్షరాలే కాదు రంగులూ జంతువుల పేర్లని ఆ పిల్లలు 'వీఆర్ సెట్'తో నేర్చుకుంటున్నారు. ఆ సెట్‌ని పిల్లల కళ్లకి తగిలిస్తే అందులో ఉన్న బొమ్మలూ రంగుల్ని చూపించి... అవేమిటో చెప్పమంటుంది. పిల్లల స్పందనని బట్టి వాళ్ల వేగాన్నీ, అవగాహననీ ఏఐ అంచనావేస్తుంది. మనదేశంలో ఏ పెద్ద కార్పొరేట్ బడుల్లోనో కనిపించే ఇలాంటి ఏఐ వసతులు ఆ అంగన్వాడీలో ఉన్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలోని వాద్‌మనా అనే ఊళ్లో ఉందీ అంగన్వాడీ కేంద్రం. నెలకిందటిదాకా మిగతా అంగన్వాడీ కేంద్రాల్లాగే ఇది ఉండేది. పేరుకి పాతికమంది పిల్లలు నమోదుచేసుకున్నా... కేవలం 10 మందే వచ్చేవాళ్లు. ఈ నేపథ్యంలోనే జిల్లా పరిషత్ యంత్రాంగం రూ.9.5 లక్షల ఖర్చుతో దేశంలోని తొలి ఏఐ అంగన్వాడీగా దీన్ని తీర్చిదిద్దింది. పిల్లలు ఇక్కడున్న ఐదారుగంటల్లో కేవలం గంటే ఏఐ పాఠాలు చెప్పినా... దానికోసమే ఎదురుచూస్తున్నారట. ఒక్క గైర్హాజరూ లేదట.

కుక్కలతో వాకింగ్... నెలకి 5 లక్షలు!



మహారాష్ట్రలో ఒక అబ్బాయి జీతం నెలకి రూ.5లక్షల రూపాయలు. ఐటీ ఉద్యోగి అయిఉంటాడులే, ఆ మాత్రం ఉండటంలో ఆశ్చర్యమేముంది అనుకుంటే పొరపాటు.... ఎందుకంటే అతనో డాగ్‌వాకర్. అవును, అతను కుక్కలని నడిపిస్తూ నెలకి ఐదులక్షల రూపాయలు సంపాదిస్తున్నాడు. ఏంటీ, కుక్కలని నడిపించడం కూడా వృత్తేనా అని ఆశ్చర్యపడకండి. శునకాలపైన అతనికున్న ప్రేమను చూసిన కుక్కల యజమానులు వాటిని ఉదయం, సాయంత్రం నడిపించే పనిని అతనికి అప్పగించారట. మొదట్లో అభిరుచిగా తర్వాత, వృత్తిగా మార్చుకున్న అతను ఒక్కో కుక్కకీ నెలకి పదిహేనువేల రూపాయలు తీసుకుంటున్నాడు. ఆ మాటకొస్తే ఇతనొక్కడే కాదు ఇలాంటి డాగ్‌వాకర్లకి దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. అందుకే డాగ్‌వాకర్లని అందించే పెట్ సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. మిస్టర్ అండ్ మిసెస్ పెట్, పెట్స్‌పోలియో వంటి సంస్థలు కుక్కలని ఉదయం, సాయంత్రం ఓ అరగంటపాటు బయట నడిపించడానికి ఆరువేల రూపాయలవరకూ వసూలు చేస్తున్నాయి. ఇదోరకం నయా వృత్తి అన్నమాట.

పాఠాలే కాదు... పాముల్నీ పట్టాలి!



కేరళ అనగానే అక్కడి కొండకోనలే కళ్లముందు మెదులుతాయి. కానీ ప్రకృతి అందాలన్నాక పాములూ అక్కడ దాగి ఉంటాయి కదా! అదే ఇప్పుడు ఆ రాష్ట్రానికి పెద్ద బెడదగా మారింది. ముఖ్యంగా అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో పాముకాట్లు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. అవి బడుల్లోని తరగతి గదుల్లోకీ వచ్చి బుస్సుమంటున్నాయి. ఆ మధ్య ఓ పదేళ్ల బాలిక పాము కాటుకి గురికావడం సంచలనం సృష్టించింది. మరి పాములకి భయపడి పాఠశాలలు నడపకుండా ఉండలేరు కదా! అందుకే- ఆ జిల్లాలోని టీచర్లకి సర్పాలని ఎదుర్కోవడంపైన శిక్షణ అందిస్తోంది అక్కడి ప్రభుత్వం. ముందుగా పాలక్కాడు జిల్లాలో దీన్ని మొదలుపెట్టింది. 64 మంది పాములు పట్టేవాళ్లతో అక్కడి గ్రామీణ ఉపాధ్యాయులందరికీ శిక్షణ అందిస్తోంది. 'పాములు కనిపిస్తే అది ఏ పామో ఎలా కనిపెట్టాలి? దాన్నుంచి బడిపిల్లల్ని ఎలా కాపాడాలి? ఎవరైనా కాటుకి గురైతే ప్రాథమిక చికిత్స ఎలా ఇవ్వాలి?' వంటివన్నీ టీచర్లకి నేర్పించారు. ఇందుకోసమే 'సర్ప' పేరుతో ప్రత్యేక యాప్‌నీ తెచ్చారు. ఈ ఫలితాన్నిబట్టి శిక్షణని కేరళ మొత్తం విస్తరిస్తారట.


హెల్మెట్ లేకుంటే పెట్రోలు పొయ్యరంతే!

ప్రజల్లో కొన్ని మంచి అలవాట్లు పెరగాలంటే... ప్రభుత్వాలు అప్పుడప్పుడూ కొంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరపాలక సంస్థ ఇప్పుడు అదే చేస్తోంది. ఎంత చెప్పినా హెల్మెట్ అలవాటు కావట్లేదని... వాహనదారులకి షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. ఆ మధ్య హెల్మెట్ వాడితేనే పెట్రోలు బంకులో ఇంధనం తీసుకునే అవకాశం ఉంటుందని ప్రకటించింది. అది కూడా ఏదో నాసిరకం హెల్మెట్ కాకుండా ఐఎస్ఐ ముద్ర ఉన్నదాన్నే వాడాలని సూచించింది. మొదట్లో చాలామంది దీనిపైన తీవ్రంగా గొడవపడ్డారు. కొందరు ఆకతాయిలైతే ఓ పెట్రోలు బంకునే తగలబెట్టబోయారు. ఇలాంటివెన్ని జరిగినా ప్రభుత్వం వెనుకంజ వేయలేదు. పైగా ఈ మధ్య మరో కొత్త షరతునీ తెచ్చింది. ప్రభుత్వాఫీసులకి టూ వీలర్‌పైన వచ్చేవాళ్లందరూ హెల్మెట్ వాడితీరాలని ప్రకటించింది. అది ఉంటేనే... లోపలికి అనుమతిస్తోంది. ఇందుకోసం ప్రతి ఆఫీసు ముందూ ట్రాఫిక్ పోలీసుల్ని ఏర్పాటు చేస్తోంది! ఇదేమిటని ప్రశ్నించే వాళ్లకి 'కొన్ని మందులంతే... చేదుగా ఉన్నా సరే వేగంగా రోగం కుదురుస్తాయి' అంటున్నారట అక్కడి అధికారులు!



హమాలీ నుంచి 'కూలీ'...

రజినీ @50



స్టార్లు చాలామంది ఉండొచ్చు. సూపర్ స్టార్ మాత్రం ఒక్కడే. ఆ కిరీటం ఒక్క రజినీకాంత్‌కే! ఎందుకంటే, ఆయన నడకకు డాన్స్ నేర్పాడు. మాటకు తూటా జోడించాడు. సిగరెట్టుతో శీర్షాసనం వేయించాడు. రజినీ సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ లేకపోయినా ఫర్వాలేదు. ప్రేక్షకుల ఈలలు సరిపోతాయి. యాభై ఏళ్ల క్రితం... సినిమా పరిశ్రమకు వచ్చిన ఆ బస్ కండక్టర్ ఇప్పుడు... ఎయిర్‌బస్ కంటే జానెడు ఎత్తుమీదే ఉన్నాడు. రజినీకాంత్ జీవితంలో ఆయన సినిమాల్ని మించిన మలుపులు ఉన్నాయి.

అసలు, రజినీకాంత్‌కు ఏమైంది? పిచ్చిపట్టిందని పుకార్లు, మొండి దయ్యం వదిలిపెట్టడం లేదని గుసగుసలు, ఎవరో మందుపెట్టి ఉంటారని అనుమానాలు! ఆయన ప్రవర్తన కూడా అందుకు తగ్గట్టుగానే ఉండేది. హోటల్‌లో వెయిటర్ మీద దాడి చేశాడు, విమానంలో ఎయిర్‌హోస్టెస్‌తో గొడవపడ్డాడు, ఏదో సభలో పూలదండ మెడలో వేస్తే పూలు లాగి తల మీద చల్లుకున్నాడు. తలాతోకా లేకుండా ఏదేదో మాట్లాడాడు. అద్దె ఇంటి కిటికీ అద్దాలు పగలగొట్టాడంటూ యజమాని రచ్చకెక్కాడు. దీంతో హీరోయిన్ శ్రీప్రియ రజినీకాంత్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లింది. మానియాక్ డిప్రెసివ్ సైకోసిస్... అని నిర్ధారించారు డాక్టర్లు. '20 రోజులుగా నిద్రపోలేదతను. ఏకాస్త ఆలస్యమైనా... బతికేవాడే కాదు' అన్నారు డాక్టర్లు. మత్తుకోసం 'మార్ఫిన్' ఇచ్చారు. అది అతన్ని గాఢనిద్రలోకి తీసుకెళ్ళలేదు కానీ... ఏదో మగత... పాత జ్ఞాపకాలేవో పైకి లేస్తున్నాయి. 'అమ్మా... అమ్..మా...' అన్న మాటే అతని చెవుల్లో వినిపిస్తోంది.

★ ★ ★

పుట్టిన నెలరోజులకే రజినీకాంత్ చనుబాలకి దూరమయ్యాడు. సరైన పోషకాహారం లేక పాలు పడలేదు తల్లికి. నలుగురు సంతానంలో చిన్నవాడు రజినీ. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివాజీరావు గైక్వాడ్. 1950 డిసెంబర్ 12... జన్మదినం. మహారాష్ట్ర నుంచి వచ్చి బెంగళూరులో స్థిరపడ్డ మరాఠీ కుటుంబం వాళ్లది. తండ్రి రానోజీరావు పోలీసు కానిస్టేబుల్. కాకపోతే, రజినీకాంత్ పుట్టడానికి రెండేళ్ల ముందే రిటైర్ అయ్యాడు. సత్యనారాయణరావు, నాగేశ్వరరావు, అశ్వత్థబాయి తర్వాత... శివాజీరావు పుట్టాడు. నెలకి ముప్పై రూపాయల పెన్షన్‌తో ఆరుగురి పొట్టనింపడం కష్టంగా ఉండేది. పోషణ కరవై రజినీ సన్నగా పుల్లలా ఉండేవాడు. దానికితోడు రంగూ తక్కువే కావడంతో 'నల్లబొగ్గు' అని అందరూ ఎగతాళి చేసేవారు. ఏడుస్తూ ఇంటికొచ్చే బిడ్డని అమ్మే అక్కున చేర్చుకునేది. ఆమె ఆస్తమా రోగి. ఓ దశలో ఆ రుగ్మత ముదిరింది. ప్రభుత్వాసుపత్రిలో చేర్పిస్తే... బతకడం కష్టమన్నారు. 'చిన్నవాణ్ణి చూడాలి...' అని ఆమె పట్టుపడితే తొమ్మిదేళ్ల రజినీకాంత్‌ని తీసుకెళ్లారు. 'ఇంట్లో చిన్నన్నయ్యా, నాన్నా బాగా కొడుతున్నారమ్మా! నువ్వు కొట్టొద్దని చెప్పు' అంటూ ఆ పసివాడు ఫిర్యాదు చేస్తుంటే ఆమె నిస్త్రాణగా అలా చూస్తూ ఉండిపోయిందట. రజినీ తల్లిని ప్రాణంతో చూడటం అదే ఆఖరు. తల్లి మరణం తర్వాత నెలపాటు... మామూలు మనిషి కాలేకపోయాడు. ఆటల్లో పడ్డా... అంతఃచేతనలో అదో మానని గాయంలా మిగిలిపోయింది. అయినా చదువులో బాగానే రాణించేవాడు. బాల్యంలోనే రంగస్థలమూ పరిచయమైంది.

చేతిలో సైకిల్ చెయిన్!

రజినీకాంత్ టెన్త్ ముగించేనాటికే వాళ్లన్నయ్య సత్యనారాయణరావు ఇంటి బాధ్యతలు చూస్తుండేవాడు. ఆయనో చిరుద్యోగి. గంపెడు కుటుంబాన్ని పోషించడం కష్టంగానే ఉండేది. దీంతో రజినీకాంత్‌ని రామకృష్ణ మఠంలో చేర్పాడు. రోజూ స్కూలు ముగియగానే మఠానికి వెళ్లి వాళ్లు చెప్పిన పనులన్నీ చేస్తే... పాలూరొట్టె ఇచ్చేవారు. ఆ చిరుగుల చొక్కా చూసి స్వామీజీలే కొత్తబట్టలు తెచ్చిచ్చేవాళ్లు! ఆధ్యాత్మికత, సేవాభావం అక్కడే నేర్చుకున్నాడు రజినీ. కానీ, ఎంతగొప్ప సుగుణాలైనా చెడు వ్యసనాలొస్తే తేలిపోతాయి. రజినీకాంత్ విషయంలో అదే జరిగింది. పీయూసీలో ఉన్నప్పుడు సీనియర్ల ద్వారా సిగరెట్ అలవాటయ్యింది. అది తాగుడుకీ దారితీసింది. చేతిలో సైకిల్ చెయిన్ పట్టుకుని రౌడీలా తిరగడం మొదలుపెట్టాడు. చదువు మానేశాడు. అదే సమయంలో, రజినీ వాళ్లక్క అశ్వత్థమ్మ పెళ్లితో ఆ కుటుంబం మరిన్ని అప్పుల్లో కూరుకుపోయింది. అన్నయ్య సత్యనారాయణకీ పెళ్ళై ఇద్దరు పిల్లలు పుట్టారు. తండ్రిని కూడా అనారోగ్యాలు చుట్టుముట్టసాగాయి. కూలో నాలో చేసి నాలుగు డబ్బులు సంపాదించక తప్పదని అర్థమైపోయింది. దాంతో పదిహేడేళ్ల రజినీ హమాలీగా మారాడు!

గొడ్డుచాకిరీ...

గొడౌన్ కొలువులో బస్తాకి పది పైసల కూలీ ఇచ్చేవారు. రోజంతా కష్టపడితే ఐదో పదో వచ్చేవి. ఈ గొడ్డుచాకిరీ వల్ల తన కుటుంబానికి ఏ మేలూ జరగదనుకున్నాడు రజినీ. వేరే పనుల కోసం ప్రయత్నించాడు. వడ్రంగి పని నేర్చుకున్నాడు. ఎడ్లబండి తోలాడు. ఆఫీస్‌బాయ్‌గా చేశాడు. 1968లో బెంగళూరులో ఆర్టీసీ ఉద్యోగాలకి ప్రకటన వస్తే- ఎంట్రన్స్ రాసి... పాసయ్యాడు. అలా కండక్టర్‌గా కుదురుకున్నాడు. మెజిస్టిక్ నుంచి శ్రీనగర్‌కి వెళ్లే 10ఏ నంబరు బస్సుకు కండక్టర్ అతను. టికెట్లు కట్ చేయడంలో వేగం, చిల్లర అందించడంలో కొత్తదనం, ముందుకు పడే జుట్టుని చేత్తో వెనక్కి

నెట్టి... తల పొగరుగా ఎగరేసి 'రైట్ రైట్' అనే ఆ స్టైల్... ప్రయాణికుల్ని ఎంతో ఆకట్టుకునేవి. ఆ హావభావాలకు ఫిదా అయ్యింది నిర్మల అనే అమ్మాయి. తను ఏదో కంపెనీలో స్టెనోగా చేస్తుండేది. 'అమ్మలా ఉంది' అనుకున్నాడు రజినీ తనని చూసి. చూపులే కాదు మనసులూ కలిశాయి. కాకపోతే, బస్‌కండక్టర్‌తో ప్రేమ ఏమిటని నిర్మలకి ఆమె తల్లిదండ్రులు వేరే పెళ్ళి చేసేశారు. ఆ బాధతో రజినీకాంత్ దేవదాసు అయిపోయాడు. సిగరెట్టూ సారా బాటిలూ మళ్ళీ చేతికొచ్చాయి. ఈసారి అతణ్ణి రాజా బాదర్ ఆదుకున్నాడు. రజినీకాంత్ కండక్టర్‌గా ఉన్న బస్సుకి తనే డ్రైవర్. ఆర్టీసీ ఉద్యోగుల సంఘం వాళ్లు వేసే డ్రామాల్లో రజినీకి అవకాశం ఇప్పించాడు. ఆ మార్పు మనసుకు మందులా పనిచేసింది. ముఖ్యంగా, 'కురుక్షేత్ర' నాటకంలోని దుర్యోధనుడి పాత్రకి చప్పట్లు మిన్నంటేవి. గద పైకెత్తే వేగం, కత్తిని ఒడుపుగా తిప్పుతూ పలికే డైలాగులకి ప్రేక్షకులు ముగ్ధులయ్యేవారు. అదంతా చూసిన రాజా బాదర్ సినిమాల్లో ప్రయత్నించమని సలహా ఇచ్చాడు. 'నేను కారు నలుపు. చిన్న కళ్లు. ముఖమంతా రకరకాల గాయాలూ మచ్చలూ... నాకెలా ఇస్తారు అవకాశం' అని కొట్టిపారేసేవాడు రజినీ.

ప్లాట్‌ఫామ్ పడక...

1975... ఆ ఏడాది చెన్నైలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ తెరిచారు. ఆ వార్త వినగానే రాజ్ బాదర్ రజినీకాంత్‌ని ఒక్క క్షణం కూడా స్థిమితంగా కూర్చోనివ్వలేదు. వెళ్లి చేరిపొమ్మని పోరుపెట్టాడు. 'అది రెండేళ్ల కోర్సు... ఉద్యోగమెలా? ఫీజులెలా కట్టాలి?' అన్నాడు రజినీకాంత్ నిరాశగా. 'ఆ విషయం నాకొదిలెయ్. నీకు నెలనెలా నా జీతం నుంచి డబ్బు పంపిస్తాను' అని మాటిచ్చాడు రాజా బాదర్. అలా కండక్టర్ ఉద్యోగానికి సెలవుపెట్టి చెన్నైలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో అడుగుపెట్టాడు రజినీ. మొదటి రోజు ఉత్సాహంగా గడిచింది కానీ... రాత్రయ్యేసరికి ఎక్కడ బస చేయాలన్న ప్రశ్న ఎదురైంది. లాడ్జ్‌లో ఉండేంత డబ్బులేదతనికి. అలా రోజంతా తిరిగి చెన్నై మౌంట్‌రోడ్డులోని ఎల్ఐసీ ప్లాట్‌ఫామ్‌పైన నిద్రపోయాడు. పొద్దున్నే లేచి అక్కడి పంపునీటితో మొహం కడుక్కుని క్లాసులకి వెళ్లాడు. మూడురోజులు అలా గడిచాయి. విషయం తెలిసి... రఘునందన్ అనే బ్యాచ్‌మేట్ తమ గదికి రమ్మన్నాడు. అప్పటికే అక్కడ ముగ్గురున్నారు. వెళ్లిన పదిరోజులకే మిగతా రూమ్మేట్లు గోలపెట్టారు. 'నువ్వేం మనిషివిరా బాబూ! కనీస శుభ్రత కూడా లేదు. వారం రోజులుగా ఒకే డ్రెస్సు వేసుకుంటున్నావు. సిగ్గులేకుండా మా లుంగీలు కడుతున్నావు. అవన్నీ పోనీ... పక్కవాళ్ల టూత్‌బ్రష్‌లు వాడకూడదన్న ఇంగితమూ లేదు. మీ అమ్మ కనీసం ఇవి కూడా నేర్పలేదా!' అని తిట్టారట. 'నాకు అమ్మ లేదు... చిన్నప్పుడే చచ్చిపోయింది. మీరు చెబితే అన్నీ నేర్చుకుంటా' అనేవాడట రజినీ. నిజంగానే... అన్నీ నేర్చుకున్నాడు... వాళ్లకంటే స్టైల్‌గా మారసాగాడు. రజినీకి రూము కష్టం తీరినా... ఆకలి బాధ తీరేది కాదు. తన రూమ్మేట్స్‌లో రఘునందన్ ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేసేవాడు. అతను ఒక్క పూట భోజనం పెట్టించేవాడు. కొంతకాలానికి అదే చోట పనిచేస్తూ వచ్చిన రామారావు అనే సర్వర్ మరోపూట అన్నం పెట్టించసాగాడు. ఈ కష్టాలకి పరాకాష్టగా మరో సంఘటన జరిగింది...

డాన్స్ వేయాలంటే...

ఓరోజు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో- మర్నాడు డాన్స్ ప్రాక్టీస్ ఉందని చెప్పాడు మాస్టారు. 'మీ కాళ్ల కదలిక నేను గమనించాలి. అందువల్ల... అందరూ షార్ట్స్ వేసుకుని రండి' అన్నాడు. రజినీకి షార్ట్స్ లేవు... కొనేంత డబ్బూ లేదు. ఆ విషయం మాస్టారికి చెబితే 'ఏదో ఒకటి చూడవోయ్...' అని కసిరి కొట్టాడు. తర్వాతి రోజు తన మామూలు ప్యాంటుతోనే వెళ్లాడు రజినీ. డాన్స్ మాస్టారు అందరి ముందూ తిట్టి బయటకు వెళ్లమన్నాడు. రజినీకాంత్... కన్నీళ్లతో తన ప్యాంటు విప్పి... అండర్‌వేర్‌తో నిల్చుని... 'నేను ఇదే చేయగలను మాస్టారూ' అన్నాడట. ఎవ్వరూ నవ్వలేదు... అతని ధైర్యానికి కదిలిపోయారు. డాన్స్ ప్రాక్టీస్ తర్వాత విషయం తెలిసి- తెలుగువారైన ప్రిన్సిపల్ రాజారామ్‌దాస్- రజినీకాంత్‌ని పిలిచి... 'ఈ ఏడాది నీ ఫీజు నేనే కడతాను' అని చెప్పారట! రెండో ఏడాది చివర్లో విద్యార్థుల నటనని పరీక్షించడానికి దర్శకుడు కె.బాలచందర్ వచ్చాడు. అప్పటికే తనవైన సినిమాలతో దక్షిణాదిలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నాడాయన. ఆయన ప్రతి సినిమా కనీసం ఐదారుసార్లు చూసేవాడు రజినీ. అంతమందిలోనూ బాలచందర్ చూపు రజినీ మీదే పడింది. 'ఇతనిలో ఏదో ఉంది... ఏమిటది... లేజర్‌లాంటి కళ్లా? సూటిగా ఉన్న ముక్కా?' అనుకున్నాడు. 'నీకు అవకాశం ఇస్తాను... వెయిట్ చెయ్' అని మాటిచ్చాడట. ఆ కాస్త ప్రోత్సాహానికే ఉప్పొంగిపోయాడు రజినీ. బాలచందర్ వచ్చి వెళ్లిన అదే రోజు... బెంగళూరు నుంచి 'స్టార్ట్ ఇమీడియట్లీ' అంటూ టెలిగ్రామ్ వచ్చింది. వెళితే... తన ఆర్టీసీ కండక్టర్ ఉద్యోగం పోయిందన్న విషయం తెలిసింది. ఇక తాడోపేడో సినిమాల్లోనే తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

తొలి షాట్... ఐదు టేకులు...!

కోర్సు పూర్తయ్యాక రూమ్మేట్లు ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతే...



'దయ' గలవాడు..!

తన తదనంతరం తనకున్న వ్యక్తిగత ఆస్తులన్నీ తన సేవా సంస్థలకే చెందేలా 1990లోనే విల్లు రాసిపెట్టాడు రజినీకాంత్. 1988లో ఓ పేద విద్యార్థి చదువుకి సాయం చేయమని అడిగినప్పుడు, 'మరి, మిగతా పిల్లల పరిస్థితి ఏమిటి?' అనే ప్రశ్న కలవరపెట్టింది. అప్పుడే, భార్య లతతో కలిసి 'దయ చారిటీస్' సంస్థని ప్రారంభించాడు. రజినీకాంత్ సూపర్‌హిట్ చిత్రం 'పడయప్ప'(నరసింహ) సినిమా రెమ్యునరేషన్ మొత్తాన్నీ ఈ సంస్థకే ఇచ్చాడు. తాను కట్టిన రాఘవేంద్ర కల్యాణమంటపాన్నీ ట్రస్టుకే అప్పగించాడు. విద్యార్థులకే కాదు, వైద్యసేవలు అవసరమైన వాళ్లకీ పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందిస్తుందీ ట్రస్టు.

ఎస్.ఆర్ గైక్వాడ్..?!

రజినీకాంత్ తొలి సినిమా రిలీజుకి కాస్త ముందు దర్శకుడు కె.బాలచందర్- 'టైటిల్స్‌లో నీ పేరు ఏమని పెట్టాలి... ఇప్పటికే ఇక్కడ శివాజీ ఉన్నారు కదా!' అన్నారట. రజినీ 'ఎస్.ఆర్. గైక్వాడ్ అని పెట్టండి సార్' అన్నాడట. 'అది నార్త్ ఇండియన్ పేరులా ఉందయ్యా' అన్నాడట. 'శరత్ అని పెట్టండి సార్' అంటే 'అందులో కొత్తదనమేమీ లేదు' అన్నారట ఆయన. తర్వాత ఆయనే 'నేను ఇదివరకు మేజర్ చంద్రకాంత్ అనే సినిమా తీశాను. అందులో రజినీకాంత్ అనే పాత్ర కూడా ఉంటుంది. చంద్రకాంత్, రజినీకాంత్... ఆ రెండింటిలో ఒకటి ఎంచుకో' అని చెప్పారట. దాంతో... నాటి శివాజీ రావు గైక్వాడ్ రజినీకాంత్ అన్న పేరునే ఎంచుకున్నాడు.

పద్మవిభూషణుడు...

ఇప్పటిదాకా 170 చిత్రాలు చేసిన రజినీకాంత్‌కి భారత ప్రభుత్వం 2000లో 'పద్మభూషణ్' అవార్డునిచ్చింది. 2016లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' అందుకున్నాడు 2021లో 'దాదాసాహెబ్ ఫాల్కే'కి ఎంపికయ్యాడు.

మరచిపోలేదు...

తొలిరోజుల్లో తనకు సాయం చేసిన వాళ్లందరినీ కంటికి రెప్పలా కాపాడుతున్నాడు రజినీకాంత్. తన రూమ్మేట్ రఘునందన్‌కి ఓ అపార్ట్‌మెంట్ కొనిచ్చి... అతని పిల్లలందర్నీ తానే చదివించాడు. హోటల్ సర్వర్‌గా తనకి ఓ పూట ఉచిత భోజనం పెట్టిన 'డాడీ' రామారావు... కుటుంబం బాధ్యతలూ తీసుకున్నాడు. ఇక తెలుగువాడైన విఠల్ ప్రసాద్ రజినీకాంత్‌తోనే ఉండిపోయాడు. ఆయనా, ఆయన తమ్ముడూ రజినీకాంత్ ఆర్థిక లావాదేవీలు చూసుకుంటున్నారు. తన మిత్రుల కోసమనే 'వళ్లి' అనే సినిమాని నిర్మించి ఆ లాభాలని వాళ్ల బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసి... నెలనెలా వాళ్లకి కొంత మొత్తం అందేలా చేశాడు. కె.బాలచందర్ తర్వాత తనకు ఎన్నో సినిమాలనిచ్చిన దర్శకుడు ముత్తురామన్, అతని సహాయకుల కోసమని 'అరుణాచలం' పారితోషికం మొత్తాన్నీ ఇచ్చేశాడు. కానీ, రాజా బాదర్‌కి మాత్రం ఏమీ చేయలేకపోయాడు. 'నాతో వచ్చి చెన్నైలో ఉండు... నా సంస్థలన్నీ చూసుకో!' అని రజినీ ఎన్నిసార్లు అడిగినా 'వద్దురా... నువ్వు ఇలాగే నా దగ్గరికి వస్తూ పోతూ ఉండు చాలు' అంటాడట రాజా బాదర్.

ప్రకటనలా... వద్దే వద్దు!

మనదేశంలో ఏ వాణిజ్య ప్రకటనల్లోనూ నటించని ఏకైక స్టార్ హీరో రజినీకాంతే! ఎవరు ఎన్ని కోట్లు కుమ్మరిస్తామన్నా సరే... 'నేను ఏ యాడ్ చేసినా నా అభిమానులు గుడ్డిగా నమ్మేస్తారు. వాటిలోని లోటుపాట్లకి నేను బాధ్యుడిని అవుతాను. కాబట్టి ఆ సంపాదన నాకొద్దు' అంటారు. 'వీడియోల్లో నటించక్కర్లేదు కనీసం మీ ముఖాన్నయినా వాడుకోనివ్వండి' అన్నా 'నో...' చెబుతారు. కానీ తమిళనాడు ప్రభుత్వం 1980ల్లో ప్రారంభించిన పల్స్‌పోలియో చుక్కల మందు వ్యాప్తికి... పైసా తీసుకోకుండా నటించాడు. రజినీ ప్రకటనతో ఆ కార్యక్రమం కుగ్రామాల్లోకి కూడా చొచ్చుకెళ్లింది. జనం 'రజినీ పోలియో చుక్కలు' అనడం ప్రారంభించారు. ఆ తర్వాత నేత్రదానం కోసం మరో ప్రకటనలో నటించారు. అదీ ఉచితంగానే.



రజినీకాంత్‌కి మళ్లీ నిలువనీడ కరవైంది. అప్పుడు తెలుగు బ్యాచ్‌కి చెందిన విఠల్ ప్రసాద్ తన ఇంట్లో ఆశ్రయమిచ్చాడు. అంతలోనే కె.బాలచందర్ నుంచి పిలుపు వచ్చింది. 'నా సినిమాలో నీది చాలా చిన్న పాత్ర... అయితేనేం, కలకాలం గుర్తుండిపోతుంది. కానీ, నువ్వు తమిళం నేర్చుకోవాలి... 20 రోజులు టైమిస్తా' అని చెప్పి పంపాడు. ఆ క్షణం నుంచే ప్రాక్టీసు మొదలుపెట్టాడు రజినీ. వారంలోనే అక్షరాలు గుర్తుపట్టడంతోపాటు భాషనూ నేర్చుకున్నాడు. ఆ తర్వాత షూటింగ్‌కి వెళ్లగానే బాలచందర్‌ని తమిళంలోనే- యాస ఏమాత్రం తేడా లేకుండా పలకరించాడు. 'ఎంత పట్టుదల ఇతనిది... 20 రోజుల్లో నేర్చుకునేశాడే!' అని అబ్బురపడ్డాడాయన. అతని సీన్ ఏమిటో వివరించాడు... భార్యని వదిలేసి, వ్యాధులపాలై చివరి రోజుల్లో మళ్లీ ఆమెని చూడాలనుకుని వచ్చే పాండ్యన్ అనే తాగుబోతు భర్త పాత్ర అది. అలా 1975 మార్చి 27... హోలీ రోజున... రజినీకాంత్‌పైన ఫస్ట్ షాట్ తీశారు. ఆందోళన కారణంగా... మొదట బాగా రాలేదు. బాలచందర్... ఒంటికాలి మీద విరుచుకుపడ్డాడు. మెల్లగా ఆయన ఏం కోరుకుంటున్నారో అర్థం చేసుకుని... ఐదో టేక్‌లో ఓకే అనిపించుకున్నాడు. ఆ తర్వాతి షాట్... నాటి స్టార్ హీరో కమల్‌హాసన్‌తో! ఆ తర్వాతివన్నీ సింగిల్ టేకులో పూర్తయ్యాయి. భారతీయ చరిత్రలో సరికొత్త సువర్ణాధ్యాయం మొదలైంది. 'అపూర్వ రాగంగల్' అనే ఆ సినిమా అదే ఏడాది ఆగస్టులో రిలీజై... పెద్ద హిట్టయ్యింది. 'క్లైమాక్స్‌లో వచ్చే పాండ్యన్ పాత్ర చాలా హుందాగా ఉంది' అని ప్రశంసించాయి పత్రికలు.

మూడోది తెలుగులోనే...

మొదటి సినిమా తర్వాత రెండునెలలు ఖాళీగానే ఉన్నాడు రజినీ. తర్వాత, కన్నడలో పుట్టన్న కనిగల్ తీసిన చిత్రంలో విలన్‌గా నటించాడు. మూడో సినిమా మళ్లీ బాలచందర్‌దే... ఈసారి తెలుగులో. 'అంతులేని కథ'లో జయప్రద అన్నయ్య పాత్ర. ఏసుదాసు గాత్రంతో 'దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి...' పాట ఆంధ్రప్రదేశ్ నలుమూలలా మారుమోగింది. సిగరెట్‌ని ఎగరేసి నోటితో పట్టే... రజినీకాంత్ ట్రేడ్ మార్క్ స్టైల్ ఇందులోనే పరిచయమైంది. తాగుబోతు జూదరి పాత్రయినా... అతనిలోని కొత్తదనం అందర్నీ మెప్పించింది. ఆ తర్వాత కె.విశ్వనాథ్ 'ఓ సీత కథ'ని బాలచందర్ 'మూండ్రు ముడిచ్చు' పేరుతో తమిళంలో తీస్తూ అందులో నెగెటివ్ హీరో పాత్రను... రజినీకే ఇచ్చాడు, శ్రీదేవి హీరోయిన్. కమల్ హాసన్‌ది అందులో అతిథి పాత్ర. అది పెద్ద హిట్టయ్యింది. కమల్, శ్రీదేవి, రజినీకాంత్ కాంబినేషన్‌లోనే దర్శకుడు భారతీరాజా '16 వయదినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు') సినిమా తీశాడు. ఎప్పట్లాగే అందులోనూ రజినీ విలన్. అయితేనేం- కుడిచేయి కాస్త ముందుకు సాచి అతను చెప్పే 'ఇదెప్పడి ఇరుక్కు' (ఇదెలా ఉంది) అనే పంచ్ డైలాగ్ తమిళనాడుని ఊపేసింది. తమిళ సినిమా చరిత్రలోనే అతిపెద్ద హిట్టుగా నిలిచిపోయింది ఆ సినిమా. అప్పుడే రజినీకి ఓ పెద్ద అవమానం ఎదురైంది...

పో... బయటకి!

'16 వయదినిలే' సూపర్‌హిట్ తర్వాత ఓ పెద్ద ప్రొడ్యూసర్ తన సినిమాకి రజినీకాంత్‌ని బుక్ చేసుకున్నాడు. 'ఆరువేల రూపాయలు పారితోషికం. షూటింగ్‌కి ముందు వెయ్యి రూపాయలు అడ్వాన్స్ ఇస్తాం' అన్నాడు. షూటింగ్ రోజు కారు వచ్చి అతణ్ణి చెన్నైలోని ఏవీఎం స్టూడియోకి తీసుకెళ్లింది. అక్కడే ఉన్న ప్రొడ్యూసర్‌ని ఇస్తామన్న అడ్వాన్సు వెయ్యి రూపాయలు అడిగితే 'ఏమిటీ... ఒక్క సినిమా హిట్టుకాగానే స్టార్ అయిపోయావా... ముందు నటించు... తర్వాత చూద్దాం' అన్నాడు. రజినీకాంత్‌కి కోపం వచ్చేసింది. 'మీరు మాటిచ్చినట్టు అడ్వాన్స్ ఇవ్వండి. అప్పుడే మేకప్ వేసుకుంటా' అన్నాడు. ఆ ప్రొడ్యూసర్ కోపంతో ఊగిపోయాడు 'నువ్వసలు మా సినిమాకే వద్దు... బయటకు నడువ్!' అన్నాడు. 'సరే... నన్ను ఇక్కడికి ఎలా తీసుకొచ్చారో అలానే కారులో దించండి' అన్నాడు. 'నీ మొహానికి కారు

12 ఏళ్ల దాకా... నో షూటింగ్!



పిల్లలు ఐశ్వర్య, సౌందర్యలకి పదకొండేళ్లు వచ్చేదాకా... తాను నటించిన సినిమాలేవీ చూపించలేదు రజినీకాంత్. నాన్న ఏ పని చేస్తుంటాడో కూడా వాళ్లకు తెలియదట. ఐశ్వర్యకి పదేళ్లు దాటాకే తొలిసారి షూటింగ్‌కి తీసుకెళ్లారు. ఐశ్వర్య 'లా' చదువుకుంది. చిన్నప్పటి నుంచీ చిత్రలేఖనం పట్ల మక్కువ. ఆస్ట్రేలియాలోని యానిమేషన్ కోర్సు చేసింది. ప్రస్తుతం ఐశ్వర్య సినిమా రంగంలో దర్శకురాలిగా స్థిరపడితే... సౌందర్య సరికొత్త సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లని సృష్టిస్తోంది. మనవళ్లు యాత్ర, లింగ(ఐశ్వర్య పిల్లలు), వేద్, వీర్(సౌందర్య కొడుకులు)ల తోనే ప్రస్తుతం రజినీకాంత్ కాలక్షేపం.

కూడానా... నడిచి వెళ్లు' అన్నాడట అతను. రజినీకాంత్ కళ్లలో చివ్వున నీళ్లు చిమ్మాయి. కాళ్లీడ్చుకుంటూ బయటకు నడిచాడు. ఇంటికి నడిచి వెళుతుంటే ఎక్కడ చూసినా అతను నటించిన '16 వయదినిలే' సినిమా పోస్టర్లే. కొన్నింట్లో అతని ఫొటో పెట్టి 'ఇదెప్పడి ఇరుక్కు' అన్న పంచ్ డైలాగ్ కూడా రాశారు! ఇంతలో బస్సుల్లో ప్రయాణిస్తున్నవాళ్లూ... రోడ్డు మీద ఉన్నవాళ్లూ... గుర్తించి 'హే రజినీకాంత్' అంటూ చుట్టుముట్టేశారు. అప్పుడు అనుకున్నాడట... 'ఈ ప్రేక్షకుల సాక్షిగా నేను గొప్ప స్టార్‌ని అవుతాను. ఇదే స్టూడియోకి పెద్ద కారులో వస్తాను. అప్పటిదాకా ఇక్కడ అడుగుపెట్టను' అని. ఆ తర్వాతి రోజే అందుకు బీజం పడింది. 'భైరవి' అనే సినిమాలో హీరోగా అవకాశం వచ్చింది. ఆ సినిమా నిర్మాతలే తొలిసారి అతనికి చెన్నై ప్రధాన రహదారి మౌంట్‌రోడ్డులో 40 అడుగుల కటౌట్ పెట్టారు. రజినీకాంత్ పేరు ముందు 'సూపర్‌స్టార్' అని చేర్చారు. అది... శాశ్వతంగా ఆ పేరుకు ముందు అతుక్కుపోయింది. అయినా... ఏవీఎం స్టూడియోలో జరిగిన అవమానం దహిస్తూనే ఉండేది. తన శపథాన్ని నెరవేర్చడం కోసం దొరికిన ప్రతి సినిమాకీ సైన్ చేయసాగాడు.

రెండేళ్లలో... 36 సినిమాలు!

ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల దాకా షూటింగులే. ఆ తర్వాత షెడ్యూళ్ల కోసం ప్రయాణాలు. తొలి ఏడాది రోజుకు రెండుగంటలు మాత్రమే నిద్రపోయాడు. అలా 1978-79... రెండేళ్లలో 36 సినిమాలు చేశాడు. 1979లో 18 సినిమాలొచ్చాయి. ఆ ఏడాదే ఫియట్ కారు కొని... కొత్త డ్రైవర్‌తో ఏవీఎం స్టూడియోలో అడుగుపెట్టాడు. కానీ... వరస షూటింగ్‌లతో నిద్ర మరింతగా తగ్గింది. మెల్లగా 'నెర్వస్ బ్రేక్ డౌన్' మొదలైంది. దానికి తాగుడూ సిగరెట్లూ ఆజ్యం పోశాయి. షూటింగ్‌లో ఎవరైనా తన కళ్లలో కళ్లు పెట్టి చూస్తే... పెద్దగా అరిచేవాడు. కొట్టేవాడు. ఇవన్నీ కలిసే రజినీకాంత్‌ని మానసిక రోగిని చేసి ఆసుపత్రి పాలు చేశాయి. మెలకువా నిద్రా కాని పరిస్థితిలో... అమ్మ జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. 'అమ్మ కావాలి... డాక్టర్. మా అమ్మ కావాలి?' అంటుండేవాడు మగతలో. 'అమ్మ చనిపోయిందిగా...' అంటే కనీసం 'రెజినా అమ్మనైనా తీసుకురండి...' అనేవాడు. రెజినా ఎవరు అంటే... అడ్రస్ చెప్పాడు. ఆమె పరుగుపరుగున వచ్చింది. రజినీని చూడగానే కన్నీళ్లు పెట్టుకుంది. 'ఏమిటీ ఇలా బంధించి ఉంచారు. విడిపించండి. మా ఇంటికి తీసుకెళతా... నేను బాగుచేస్తా' అంది. 'ఇంతకీ ఎవరమ్మా మీరూ?' అంటే... 'నా పేరు రెజినా విన్సెంట్. మా ఇంటిని ఓ షూటింగ్ కోసం అద్దెకిస్తే అక్కడ కనిపించాడు రజినీ. ఎప్పుడూ తాగుతూ ఉండేవాడు. మా వాడి వయసు ఉంటుందేమో. అందుకని గట్టిగా మందలించాను. అప్పట్నుంచి 'అమ్మా' అనే పిలుస్తుంటాడు. నేను నడిపే మదర్‌థెరెసా చారిటీస్ ట్రస్టు పిల్లలకి సాయం చేస్తాడు. ఇతణ్ణి నాకు అప్పగించండి' అందట. 'జాగ్రత్త. వయొలెంట్‌గా బిహేవ్ చేయొచ్చు' అంటూ రజినీని ఆమె ఇంటికి పంపారట డాక్టర్లు. తర్వాతి రోజు మధ్యాహ్నం రజినీని కౌన్సెలింగ్‌కి తీసుకొచ్చిందామె. అప్పుడు కాస్త తేటగా కనిపించాడు. 'రాత్రి చక్కగా నిద్రపోయాడు. ఇక భయంలేదు డాక్టర్' అందట. అలా మూడునెలలు రెజినానే రజినీని తల్లిలా కాచుకుంది. అతనికి నర్సుగానూ, మేనేజర్‌గానూ, ఆడిటర్‌గానూ మారింది. బతికున్నంత వరకూ రజినీకి తల్లికాని తల్లి అయ్యింది. ఆమే ఓ రోజు 'పెళ్లి చేసుకో... కుదుటపడతావు' అని చెప్పింది. ఆమె చెప్పిన కొన్ని నెలలకే పెళ్ళయింది. అదీ చాలా నాటకీయంగానే...

కులాలు వేరైనా...

అది చెన్నైలో షావుకారు జానకి ఇల్లు. కె.బాలచందర్ సినిమా షూటింగ్ జరుగుతోంది. అప్పుడే రజినీకాంత్‌ని ఇంటర్వ్యూ చేయాలని ఓ విద్యార్థినుల బృందం వచ్చింది. వాళ్లలో లత అనే అమ్మాయి చకచకా ప్రశ్నలు వేయసాగింది. 'నేను నటించే హీరోయిన్‌లూ ఈ అమ్మాయి ముందు ఏమాత్రం పనికిరారు...' అనుకున్నాడతను. ఇంటర్వ్యూలో భాగంగా 'మిస్టర్ రజినీకాంత్, మీరెలాంటి అమ్మాయిని పెళ్లి చేసుకుంటారు?' అని అడిగిందామె. 'హోమ్లీగా ఉండే అమ్మాయిని' అని జవాబిచ్చాడు. 'హోమ్లీ అన్న పదానికి మీ నిర్వచనం ఏమిటీ?' అందామె. 'మీలాగా అనుకోండి... అందంగా, తెలివిగా, ధైర్యంగా' అన్నాడు స్టైల్‌గా. తను సిగ్గుపడి వెళ్లిపోయింది. 'ఎవరా అమ్మాయి...?' అని షావుకారు జానకిని అడిగితే 'కమెడియన్ వైజీ మహేంద్రన్ మరదలు... భార్య చెల్లెలు' అంది. చెన్నైలో లతవాళ్లది పేరున్న విద్యావేత్తల కుటుంబం. రజినీకాంత్ వైజీ మహేంద్రన్‌ని పిలిచి విషయం చెప్పాడు... అతను 'చూద్దాం' అన్నాడు. లత కుటుంబంలో ఇదో పెద్ద భూకంపానికి దారితీసింది. 'కులం వేరు. నువ్వేమో పీజీ చేశావ్... అతను టెన్త్ పాసట. పైగా మహా కోపిష్టట. చెడు అలవాట్లు బోలెడున్నాయని వినికిడి. అతనితో పెళ్లేమిటి?' అన్నాడు ఆమెతండ్రి రంగాచారి. లత రజినీని నేరుగా చూసింది ఒక్కసారే... అయినా మనసిచ్చేసింది. దాంతో తండ్రికి ఎదురు తిరిగింది. చేసేది లేక ఆయనా ఒప్పుకున్నారు. అలా తిరుపతిలో నిరాడంబరంగా లత-రజినీకాంత్ దంపతులయ్యారు.

రజినీ జీవితంలో లత రాక... ఓ పెద్ద మలుపు. ఉవ్వెత్తున ఎగసే అతని ఆవేశానికి నేర్పుగా కట్టిన ఆనకట్ట తను. అదే... రజినీకాంత్‌ని ఎదురులేకుండా తీర్చిదిద్దింది. ప్రతికూల భావనల కోపిష్టిని... సానుకూల శాంతస్వభావునిగా మార్చింది. వ్యసనపరుణ్ణి... నటనా వివశుణ్ణి చేసింది. ఆ తర్వాత రజినీకాంత్ చేసిన సినిమాలూ... అతని స్టైల్... మొత్తంగా తీరేమారింది. ఓ కొత్త చరిత్ర మొదలైంది... ★







'డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయా?' ఈ మాటని తరచూ వింటూనే ఉంటాం. ఒకవేళ కాస్తే ఎలా ఉంటుందని ఎప్పుడైనా ఆలోచించారా? ఇంతవరకూ ఆలోచించకపోతే ఇకనుంచైనా ఆ పని చేయండి. ఎందుకంటే... ప్రభుత్వాలూ, కార్పొరేట్ సంస్థలూ చెట్లు నాటితే డబ్బులు ఇస్తున్నాయి కాబట్టి. రైతులూ, ఎన్జీవోలూ, సామాన్యులూ... ఎవరైనా సరే చెట్లునాటి, పర్యావరణహిత పనులతో 'కార్బన్ క్రెడిట్స్' రూపంలో డబ్బులు సంపాదించుకోవచ్చు. అసలేంటీ కార్బన్ క్రెడిట్స్ అంటే...

ఒక్క మొక్క నాటితే....
30 ఏళ్లు డబ్బులిస్తారు...!

ఉత్తరప్రదేశ్‌లోని పాతికవేలమంది రైతులు తమ పొలాల్లో మొక్కలు నాటినందుకు ప్రభుత్వం ఒక్కొక్కరికీ పదివేల రూపాయలు అందించింది. ఒక్కసారి కాదు, మరో 30 ఏళ్లపాటు ఇలా ఇస్తామని రైతులతో ఒప్పందం కుదుర్చుకుంది. వాళ్ల పొలంలో వాళ్లు మొక్కలు నాటుకుంటే ప్రభుత్వం ఎందుకు డబ్బులిచ్చిందనేగా మీ సందేహం?

గుజరాత్‌లోని లక్షమంది రైతులు తమ పొలాల్లోని వ్యవసాయ వ్యర్థాలని బయట పారేయకుండా వాటిని కాల్చి 'బయోచార్' అనే బొగ్గుని తయారుచేసుకుని తమ పొలాల్లోనే ఎరువుగా వాడుకుంటున్నారు. అలా వాళ్లు తయారుచేసిన ప్రతి టన్ను బొగ్గుకీ రూ.800 నుంచి రూ.2000వేల వరకూ డబ్బులు చెల్లిస్తుందో కార్పొరేట్ సంస్థ. 'అరె.... వాళ్లు ఆ బొగ్గుని అమ్మలేదు, తమపొలంలోనే ఎరువుగా వాడుకుంటే కంపెనీలు ఎందుకు ఎదురు డబ్బులు ఇవ్వాలి' అనేగా మీ డౌటు?

తెలంగాణాలోని యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ 13 గ్రామాలకు చెందిన పంచాయతీల్లో నాటిన ఒక్కోచెట్టుకీ ఏడాదికి రెండువేల నుంచి నాలుగువేల రూపాయల వరకూ... 30 ఏళ్లపాటు ఇవ్వడానికి ఐవోరా అనే సంస్థ ఒప్పందం చేసుకుంది.

ఇక్కడ మాత్రమే కాదు... మేఘాలయా, హరియాణా, ఒడిశా, పంజాబ్, మధ్యప్రదేశ్ రైతులు కూడా తమ పొలాల్లో చెట్లు నాటినందుకూ, సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసినందుకూ, సోలార్ ప్యానెళ్లు ఏర్పాటుచేసుకున్నందుకూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఇలా రైతులకూ, పంచాయతీలకూ... ప్రభుత్వాలూ, కార్పొరేట్ సంస్థలూ ఎదురు డబ్బులు ఇవ్వడానికి కారణం- వాళ్లు చెట్లు నాటి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడమే! మరి ఇతర రైతులూ ఈ పద్ధతిలో అదనపు ఆదాయాన్ని పొందాలంటే, ఏం చేయాలో చూద్దాం.



రైతుకి అదనపు ఆదాయం...

'పరిశ్రమల కారణంగా వాతావరణంలో కాలుష్యం, ముఖ్యంగా గ్రీన్‌హౌస్ వాయువులు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా ఒక సంస్థ పరిమితికి మించి వాతావరణంలోకి కాలుష్యాన్ని వెలువరిస్తే ఆ మేరకు జరిగిన నష్టాన్ని, పర్యావరణహిత పనుల ద్వారా పూరించాల్సి ఉంటుంది. అలాగని ఈ సంస్థలన్నీ స్వయంగా చెట్లు నాటలేవు కాబట్టి, ఆ పనిచేసే రైతులూ, ఎన్జీవోలూ, ప్రభుత్వాల నుంచి కార్బన్ క్రెడిట్స్‌ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గాల్లోంచి ఒక టన్ను కార్బన్‌డయాక్సైడ్‌ని తొలగిస్తే, అది ఒక కార్బన్ క్రెడిట్‌తో సమానం అన్నమాట. ఇలా ఎన్ని టన్నుల కాలుష్యాన్ని తగ్గిస్తే, అన్ని కార్బన్ క్రెడిట్స్‌ని సొంతం చేసుకుని- వాటిని కార్పొరేట్ కంపెనీలకు అమ్మి రైతులు ఆదాయాన్ని అందుకోవచ్చు. పండ్లతోటలతోపాటు... రావి, మర్రి, టేకు, వేప, వెదురు వంటి అడవిజాతి చెట్లని నాటినా రైతుకి ఏటా అదనపు ఆదాయం వస్తుంది. అయితే ఈ పనులన్నీ రైతులు సొంతంగా చేసుకోలేరు కాబట్టి ఇందుకోసం కొన్ని స్టార్టప్ సంస్థలు పనిచేస్తున్నాయి. రైతులు నాటిన మొక్కలకు జియో ట్యాగ్ చేసి అవి ఏ మేరకు కాలుష్యాన్ని అదుపుచేస్తాయో టెక్నాలజీ సాయంతో పక్కాగా లెక్కకట్టి ఆ కార్బన్ క్రెడిట్స్‌ని కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతాయి. ఆ వచ్చిన డబ్బుని రైతులకి అందిస్తున్నాయి' అంటున్నారు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సీనియర్ సోషల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న ప్రసన్నకుమార్. ఈ క్రమంలోనే



మైక్రోసాఫ్ట్ సంస్థ మధ్యప్రదేశ్‌లోని 20వేల హెక్టార్ల భూమిలో రైతులని ప్రోత్సహించి మొక్కలు నాటిస్తుంటే, గూగుల్ సంస్థ గుజరాత్‌లోని రైతులతో బయోచార్‌ని తయారు చేయిస్తూ వారికి ఆదాయాన్ని అందిస్తోంది.

బయోగ్యాస్ ద్వారానూ...

'సోలార్‌ప్యానెల్స్, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు, తక్కువ కాలుష్యాన్ని వెలువరించే సాగు పద్ధతుల ద్వారా కూడా రైతులు ఈ కార్బన్ క్రెడిట్స్‌ని సంపాదించుకోవచ్చు. రసాయన ఎరువులు వాడకుండా, నేలసారాన్ని పెంచినా కూడా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు' అంటున్నారు ఆదిలాబాద్, షోలాపూర్ ప్రాంతాల్లోని రైతుల కోసం బయోగ్యాస్ ప్లాంట్లని రూపొందిస్తున్న ఎర్ర హర్షవర్ధన్. కాలుష్యాన్ని తగ్గిస్తూ, అదనపు ఆదాయం పొందాలనుకునే రైతులకు భూమిత్ర, సంకల్పతరు ఫౌండేషన్, పీపల్ వేస్ట్ మేనేజర్స్, గ్రో బిలియన్‌ట్రీస్, జీకేఎఫ్ ఆగ్రోఫారెస్ట్రీ, కార్బన్‌క్రెడిట్ కార్పొరేషన్ వంటి సంస్థలు తగిన అవగాహన కల్పించి అదనపు ఆదాయం బాట పట్టేట్లు చేస్తున్నాయి. అటు పర్యావరణానికి మేలుచేస్తూ, ఇటు రైతులకూ ఆదాయాన్నిస్తున్న ఈ 'కార్బన్ ఫార్మింగ్' మంచి ఆలోచన కదూ! ★

పరిశోధన



వేళ పాటించకపోతే... 172 రకాల జబ్బులు

రోజులో కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలపాటు నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిదన్నది మనందరికీ తెలిసిన విషయమే. అయితే, ఆ ఎనిమిది గంటల నిద్ర కూడా... రోజూ ఒక పద్ధతి ప్రకారం ఉండాలనీ, లేకపోతే 172 రకాల వ్యాధులకు కారణమవుతుందనీ చైనాలోని పెకింగ్, అమెరికాలోని వాండర్‌బిల్ట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు తేల్చారు. మనలో చాలామంది 'ఏ సమయంలో పడుకుంటేనేం, తగినంత నిద్రపోవడమేగా ముఖ్యం' అనుకుని రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోయి, పగలు లేటుగా నిద్రలేస్తారు. ఒక సమయం అంటూ పాటించకుండా ఇష్టమొచ్చినట్టుగా నిద్రపోవడంవల్లనే ఎక్కువగా అనారోగ్యాల పాలవుతారని ఈ పరిశోధన తేల్చింది. 89 వేలమందిపైన, ఏడేళ్లపాటు సాగిన ఈ పరిశోధనలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. తరచూ రాత్రి పన్నెండు దాటిన తర్వాత నిద్రపోయేవాళ్లలో లివర్‌సిరోసిస్ సమస్యలు రావడానికి రెండు రెట్లు ఎక్కువ ఆస్కారం ఉందని తేలింది. అలాగే టైప్2 డయాబెటిస్, పార్కిన్‌సన్స్, గాంగ్రీన్, కిడ్నీ సమస్యలు సహా 172 రకాల జబ్బులు రావడానికి ఒక పద్ధతి అంటూ లేకుండా సాగే నిద్ర అలవాట్లే కారణమని పరిశోధకులు తేల్చారు. దీనిని బట్టి ఎంత నిద్రపోయాం అన్నది కాదు, ఎప్పుడు ఏ సమయంలో నిద్రపోతున్నాం అన్నది కూడా ముఖ్యమేనన్నమాట.

పొట్ట తగ్గించే కాఫీ...



కాఫీ అనగానే దాని అమోఘమైన పరిమళం, రుచే మనకు చటుక్కున గుర్తుకొస్తాయి. వీటితోపాటు... కాఫీలోని 'కేఫ్‌స్టాల్' అనే మూలకానికి పొట్టచుట్టూ ఉన్న కొవ్వుని కరిగించి బరువు తగ్గించే గుణం కూడా ఉందని డెన్మార్క్ శాస్త్రవేత్తలు కనిపెట్టారు. పరిశోధనల్లో భాగంగా శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన కొంతమందికి ఆహారనియమాల్లో ఎటువంటి మార్పులూ చేయకుండా 12వారాలపాటు ఉదయం, సాయంత్రం రెండుసార్లు కేఫ్‌స్టాల్ పుష్కలంగా ఉన్న కాఫీని అందించారు. ఆ తర్వాత పరిశీలిస్తే వాళ్లంతా దాదాపు 800గ్రాముల వరకూ బరువు తగ్గడం గమనించారు. 'కేఫ్‌స్టాల్'కి కొవ్వుని విచ్ఛిన్నం చేసే శక్తితోపాటు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగకుండా అడ్డుకునే గుణం కూడా ఉందని ఈ పరిశోధనలో తేలింది. అయితే, ఇన్‌స్టెంట్ కాఫీతోపోలిస్తే, ఫిల్టర్ కాఫీలో ఈ కేఫ్‌స్టాల్ ఎక్కువగా ఉంటుందట. మరెందుకు ఆలస్యం, కాస్త శ్రమ అయినా ఫిల్టర్ కాఫీ చేసుకుని తాగితే ఇటు రుచితోపాటు అటు బరువు కూడా తగ్గొచ్చు.



వాళ్లు మన ఆయుష్షు తగ్గిస్తారు!

కష్టాల్లోనూ, కన్నీళ్లలోనూ తోడుగా ఉండాల్సిన స్నేహితులూ, బంధువులే మన మనస్తాపానికి కారణం అయితే? ఇలాంటి బంధాలు మనసుకు మాత్రమే భారం... గుండెకు మాత్రమే కోతపెడతాయి అనుకుంటే పొరపాటేననీ, అవి మన ఆయుష్షుని కూడా తగ్గిస్తాయనీ న్యూయార్క్, ఉటా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో తేలింది. ఊబకాయం, వ్యాయామం లేకపోవడం వంటివి మన ఆరోగ్యాన్ని ఎంతగా పాడుచేస్తాయో ఈ టాక్సిక్ రిలేషన్‌షిప్స్ కూడా అంతే హానిచేస్తాయని ఈ పరిశోధనల్లో తేలింది. తమ చేతలతో, మాటలతో తరచూ ఇబ్బందిపెట్టేవారి కారణంగా... మన శరీరంలో ఒత్తిడిని అదుపుచేసే వ్యవస్థ అతిగా స్పందిస్తూ ఉంటుందట. ఫలితంగా, కార్టిసాల్ ఎక్కువగా విడుదల అవడం, అంతర్గత వాపులు ఏర్పడటంవల్ల వృద్ధాప్యం త్వరగా పలకరిస్తుందట. ఇక, ఈ నెగెటివ్ మనస్తత్వం ఉన్నవాళ్లతో పరిచయాలు పెరిగే కొద్దీ మన జీవితకాలం కూడా క్రమంగా తగ్గుతూ వస్తుందని ఈ పరిశోధన చెబుతోంది.

పెరుగుతో జెల్ ఇంజెక్షన్


పెరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నది తెలిసిన విషయమే. ఇప్పుడు అదే పెరుగు నుంచి కొలంబియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు జెల్ తరహాలో ఉండే ప్రత్యేకమైన ఇంజెక్షన్‌ని తయారుచేశారు. ఈ ఇంజెక్షన్ శరీరంలోపల గాయపడిన కణాలని పునరుద్ధరించి, మనం అనారోగ్యం పాలవకుండా చూస్తుందట. మన చేతికో, కాలికో గాయమైతే మందు రాస్తాం. అదే శరీరంలోపల వాపులు ఏర్పడినా, కణాలు గాయపడినా వాటిని బాగుచేసేందుకు వైద్యులు కొన్ని సెల్ రిపేర్ థెరపీలను అనుసరిస్తారు. ఇవి ఖరీదైనవి మాత్రమేకాదు, వాటితో సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉంటాయట. శాస్త్రవేత్తలు కనిపెట్టిన ఈ కొత్తపద్ధతి ప్రకారం... పెరుగు నుంచి ఎక్స్‌ట్రాసెల్యులర్ వేసికిల్ అనే కణాలని సేకరించి వాటిని జెల్‌రూపంలోకి మార్చి, సమస్య ఉన్న చోట ఇంజెక్ట్ చేస్తారు. ఈ జెల్ శరీరంలో ప్రవేశించి, అచ్చంగా సాధారణ కణాలు ఎలా ప్రవర్తిస్తాయో అలా ఒకదానితో ఒకటి అనుసంధానం చేసుకుంటూ పాడయిన కణాలని తిరిగి బాగుచేస్తుందట. ఈ విధానంలో ఎటువంటి రసాయనాలూ వాడాల్సిన అవసరం లేదు కాబట్టి, తక్కువ ఖర్చులో- సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా భవిష్యత్తులో కణాలని బాగు చేయొచ్చని అంటున్నారు శాస్త్రవేత్తలు.







పసిపిల్లలకు పద్ధతిగా తినడం నేర్పిస్తాం, అప్పుడప్పుడే అడుగులు వేస్తుంటే... చిటికెన వేలు పట్టుకుని ఆసరా ఇస్తాం, వచ్చీరాని వాళ్ల మాటలని సరిచేస్తూ 'అలా కాదు.. ఇలా' అంటాం. ఇవన్నీ అందరు తల్లిదండ్రులూ పిల్లలందరికీ నేర్పేవే. వీటితోపాటు ఇడర్ గ్రామస్థులు, తమ ఊరిపిల్లలకు పొదుపుని కూడా ఉగ్గుపాలతోనే నేర్పుతున్నారు. ఫలితం... రూ.30కోట్ల రూపాయల పొదుపుతో, దేశంలోనే అతిపెద్ద బాలల కో-ఆపరేటివ్ బ్యాంక్ విజయగాథకు వేదికైంది ఈ గ్రామం.



పిల్లలు చేసిన పొదుపు... రూ.30 కోట్లు!

డబ్బు విలువ తెలిసిన వాళ్లు... రూపాయిని పాపాయిలా పెంచాలంటారు. కానీ పాపాయిలే రూపాయిని పెంచితే ఎలా ఉంటుందో చెప్పే కథే ఈ 'బాల్‌గోపాల్ సేవింగ్స్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ' సాధించిన విజయం. గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో ఉన్న ఇడర్ గ్రామంలో వ్యవసాయం, కూలిపనులు చేసుకునే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలే ఎక్కువ. అది 2009... రైతులూ, ఆడవాళ్లూ పొదుపులో ఉన్న శక్తిని తెలుసుకుని రూపాయి రూపాయి కూడబెడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకుల సాయంతో ఆర్థికంగా ప్రగతిబాట పడుతున్న రోజులవి. ఇడర్ గ్రామ ప్రెసిడెంట్ అశ్విన్‌భాయ్‌పటేల్‌కి కో-ఆపరేటివ్ రంగంలో అపారమైన అనుభవం ఉంది. 'రైతులూ, ఆడవాళ్లకేనా... పిల్లలకు కూడా ఇటువంటి కో-ఆపరేటివ్ బ్యాంకు విధానం ఉంటే ఎలా ఉంటుంది?, జీవితం సగం గడిచిపోయాక పొదుపు గురించి ఆలోచిస్తేనే ఇంత మంచి జరుగుతోందే... అదే, పొదుపు చేసే అలవాటుని చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పిస్తే ఎలా ఉంటుందో' అనుకున్నాడు అశ్విన్‌పటేల్. అనుకున్నదే ఆలస్యం... పిల్లలకోసం 'బాల్‌గోపాల్ సేవింగ్స్' పేరుతో ఒక పొదుపు సంస్థని ప్రారంభించాడు. రూ.110 కట్టి ఈ బాల్‌గోపాల్ సేవింగ్స్‌లో ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకోసం ఒక పొదుపు ఖాతాని తెరవొచ్చు. అప్పుడే పుట్టిన పిల్లాడి నుంచి పద్దెనిమిదేళ్లలోపు వారెవరైనా ఇందులో సభ్యులుగా చేరొచ్చు. అలా చేరిన వారికి ఒక పిగ్గీ బ్యాంకుని ఇస్తారు. అందులో అమ్మానాన్నలు ఇచ్చిన డబ్బుని దాచుకోవచ్చు. ప్రతినెలా 'బాల్ గోపాల్' ప్రతినిధుల్లో ఒకరు వచ్చి... ఆ పిగ్గీబ్యాంకుని తెరుస్తారు. పిల్లలు అందులో ఏమైనా దాచుకుంటే ఆ మొత్తాన్ని తీసుకుని, దానికో రసీదు ఇస్తారు. దాచుకున్న మొత్తానికి ఆరుశాతం వడ్డీ ఇస్తారు. ఇడర్‌లో మొదలైన ఈ పిల్లల పొదుపు గురించి, ఆనోటా ఈనోటా తెలిసి... చుట్టుపక్కల ఊళ్లలోని పెద్దవాళ్లు కూడా తమ పిల్లల పేరిట పొదుపు ఖాతాలు తెరవడం మొదలుపెట్టారు. 'ఇంట్లో అమ్మానాన్నలు దాచుకొమ్మని ఇచ్చే చిల్లరా, బంధువులు చేతిలో ఉంచిన డబ్బులూ మాత్రమే కాదు... సెలవు రోజుల్లో తల్లిదండ్రులతో కూలిపనులకు వెళ్లి సంపాదించిన డబ్బుల్ని కూడా ఈ పిగ్గీ బ్యాంకులో దాచుకునేవారు ఎంతో మంది పిల్లలు. ఇంట్లో ఇచ్చిన డబ్బుని ఖర్చుపెట్టకుండా, ఇలా దాచిపెడుతున్నందుకు ఎవరికీ బాధ ఉండేదికాదు. ఎందుకంటే వాళ్లకు అవసరం అయినప్పుడు, మేం తిరిగి ఇస్తాం కాబట్టి. చదువయ్యాక అమ్మానాన్నలని అడగాల్సిన అవసరం లేకుండా స్వతంత్రంగా బతకడానికి కావాల్సిన భరోసాని ఇవ్వడానికే ఈ బాలల పొదుపు సంఘాన్ని ప్రారంభించాం' అంటారు ఆ సంస్థ ఛైర్మన్ అశ్విన్‌భాయ్‌పటేల్.


అశ్విన్





ముప్పైవేలమంది సభ్యులుగా...

పదహారేళ్ల క్రితం నెలకి ఇరవై, ముప్పై రూపాయలతో పొదుపు ప్రారంభించిన పిల్లలు... ఇప్పుడు ట్యూషన్ ఫీజులు కట్టడానికీ, ల్యాప్‌టాప్‌లూ, సైకిళ్లూ కొనుగోలు చేయడానికీ తల్లిదండ్రులని అడగడం లేదు. బాల్‌గోపాల్‌సేవింగ్స్ నుంచి తక్కువ వడ్డీకి రుణం తెచ్చుకుని కావాల్సినవి కొనుక్కుంటున్నారు, ఫీజులు కడుతున్నారు. మొదట్లో ఈ సంఘంలో మూడు వందల మంది పిల్లలు మాత్రమే సభ్యులుగా ఉండేవారు. ఇప్పుడు సబర్‌కాంతా, ఆరావళి జిల్లాల్లోని 335 గ్రామాలకు చెందిన 30వేలమంది పిల్లలు సభ్యులుగా ఉన్నారు. చిన్న పొదుపు సంఘంగా మొదలైన ఈ సంస్థ ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద బాలల క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీగా అవతరించింది. చిన్నవయసులోనే ఈ సంస్థలో చేరిన కేతుల్‌పాటిల్ ఇప్పుడు ఇంజినీరింగ్ పూర్తిచేస్తే... పాల్కిన్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఇలా ఇంజినీరింగ్ పూర్తిచేసిన వాళ్లూ, ఇంకా పైచదువులకు వెళ్తున్న వాళ్లూ దాదాపు ఐదువేలమంది తమ పొదుపు డబ్బుని ఎన్నోరెట్లు పెంచుకుని వెనక్కి తీసుకుంటే... ప్రతినెలా మూడొందలమందికి పైగా పిల్లలు కొత్తగా ఖాతాలు తెరుస్తున్నారట. వీళ్లంతా కలిసి ఇందులో దాచిన మొత్తం రూ.30 కోట్లకు చేరిందంటే చిన్నకథ కాదుగా! అందుకే మొన్నామధ్య కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాలా ఈ పిల్లల్ని చూసి పెద్దలే నేర్చుకోవాలి అంటూ రాజ్యసభలో చమత్కరించారు. ★

ఒక వయసు వచ్చాక పెద్దవాళ్లూ పిల్లలతో సమానమే! వాళ్లనీ కంటికి రెప్పలా చూసుకోవాల్సిందే. వయసుతోపాటు శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటారు. అలా అనీ ఎల్లవేళలా ఎవరో ఒకరు వాళ్ల పక్కనే ఉండలేరు కదా! ఆ లోటును తీర్చడానికే మార్కెట్లో ఎల్డర్‌కేర్ గ్యాడ్జెట్లూ, వస్తువులూ బోలెడన్ని దొరుకుతున్నాయి. వీటిసాయంతో పెద్దవాళ్లు రోజువారీ పనుల్ని సొంతంగా చేసుకుంటూ, ఆనందంగా గడిపేయొచ్చు!

(ఆగస్టు 21... సీనియర్ సిటిజన్స్ డే)



ఈ వస్తువులు... పెద్దవాళ్లవే!







పాటలు పాడే చేతికర్ర!

పెద్దవాళ్లను అంటి పెట్టుకుని ఉండే చేతికర్రనే... బయటకు వెళ్లినప్పుడు దారి చూపిస్తే, మధురమైన సంగీతాన్ని వినిపిస్తే, మన ఆచూకీని తెలియజేస్తూ, రక్షణ కవచంలా ఇంట్లోవాళ్లను అలర్ట్ చేస్తుంటే... ఎంత బాగుంటుందో కదా! టెక్నాలజీని జతచేసుకున్న స్మార్ట్ స్టిక్స్‌లో ఇలాంటి ఎన్నో రకాల ఆప్షన్లు వస్తున్నాయి. బ్లూటూత్, ఎఫ్‌ఎం, ఫాల్ అలర్ట్, ఎస్‌ఓఎస్ బటన్, జీపీఎస్ వంటివెన్నో ఉన్నాయి. ఇవేకాదు... అవసరమైతే మడతపెట్టుకునేలా, చీకట్లో టార్చ్‌లైట్ వేసుకునేలా, చేతికర్ర మీద బటన్ నొక్కి ఫోన్‌కాల్స్‌నీ రిసీవ్ చేసుకునేలా... ఇలా పెద్దవాళ్లకు వివిధ సదుపాయాల్ని కల్పిస్తూ దొరుకుతున్నాయి ఈ స్మార్ట్ వాకింగ్ కేన్స్. ఫోన్‌కి అటాచ్ చేసుకుని, కావాల్సినప్పుడు ఛార్జింగ్ పెట్టుకుంటే సరి. కేవలం నడిచేప్పుడు ఊతంలాగే కాదు, మరెన్నో అవసరాల్నీ తీరుస్తాయి. ఈ స్మార్ట్ కర్ర చేతిలో ఉంటే పెద్దవాళ్లు ఒంటరిగా బయటకు వెళ్లినా- ఇంట్లో వాళ్లు కాస్త నిశ్చింతగా ఉండొచ్చు, ఏమంటారు!





పెద్ద అక్షరాలే వీటి ప్రత్యేకం!

టీవీ చూస్తూ ఛానెల్ మార్చేప్పుడైనా, ఫోన్ తీసి డయల్ చేసేప్పుడైనా, కీబోర్డ్ మీద టైప్ చేస్తున్నా... కాస్త తీక్షణంగా చూస్తూ ఆ పనులు చేస్తుంటారు చాలామంది పెద్దవాళ్లు. ఆ చిన్న అసౌకర్యం కూడా ఉండకూడదంటే పెద్ద పెద్ద అక్షరాలూ, అంకెలతో వచ్చే గ్యాడ్జెట్లనూ, వస్తువులనూ వాడితే సరి. చూడగానే కనిపించే నంబర్ల కీప్యాడ్‌తో 'ఈజీఫోన్' వచ్చింది. దీని వెనక ఎమర్జెన్సీ బటన్ కూడా ఉంటుంది. అత్యవసర సమయాల్లో దాన్ని నొక్కితే చాలు, ఇంట్లోవాళ్లకు ఫోన్, మెసేజ్ వెళ్లిపోతాయి. దీన్ని వాడటమూ సులువే, రక్షణగానూ ఉంటుంది. ఇంకా 'బిగ్ బటన్ యూనివర్సల్ రిమోట్, లార్జ్ ప్రింట్ కంప్యూటర్ కీబోర్డ్' కూడా వచ్చాయి. మామూలు వాటితో పోల్చితే ఇవి పెద్దవాళ్లకు ఇబ్బంది తగ్గిస్తాయి!





వేళకు మందులు ఇస్తుంది!

'బీపీ ట్యాబ్లెట్ వేసుకోవడం మరిచిపోయా, అందుకే కళ్లు తిరుగుతున్నట్టున్నాయి', 'అరె, తినకముందే కదా, గ్యాస్ ట్యాబ్లెట్ వేసుకోవాల్సింది'... ఇంట్లో అప్పుడప్పుడైనా ఇలాంటి మాటలు వినిపిస్తుంటాయి. వయసుతోపాటు వచ్చే అనారోగ్యాల వల్ల పెద్దవాళ్లైతే దాదాపుగా ఏదో ఒక ట్యాబ్లెట్ వాడాల్సిందే. అది గమనించే- మందుల్ని ఒక క్రమపద్ధతిలో ఆర్గనైజ్ చేసుకుంటూనే, సమయానికి గుర్తు చేసేలా 'డిజిటల్ పిల్ బాక్సులు' వచ్చాయి. వీటిలో- ముందుగా సెట్ చేసుకున్న తేదీ, సమయం ప్రకారం అలారం మోగుతుంది. ఫోన్ నుంచి కూడా దీన్ని ఆపరేట్ చేసుకోవచ్చు. ఈసారెప్పుడైనా ఇంట్లోని పెద్దవాళ్లకు ఏదో ఒక బహుమతి కాకుండా ఇలాంటిది ఇచ్చామంటే- మనం దగ్గర లేకపోయినా మరిచిపోకుండా వాళ్లే సమయానికి మందులు వేసుకుంటారు. ప్రయాణాల్లోనూ ఎంతగానో ఉపయోగపడే ఈ ట్యాబ్లెట్ ఆర్గనైజర్లలో మనకు కావాల్సిన సైజులూ వచ్చాయి.



ఆనుకుని కూర్చోవచ్చు

కొంతమంది వృద్ధులు- ఎవరి మీదా ఆధారపడరు. బండి మీద బయటకు వెళ్లి తమ పనులు స్వయంగా చేసుకుంటారు. కాస్త దూరం వరకూ అయితే పర్వాలేదు కానీ ఎక్కువసేపు ప్రయాణించాల్సి వస్తే కూర్చోవడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే 'కేలా సన్స్' పెద్దవాళ్ల కోసం ఈమధ్య పీఈవీ ఫాంటమ్ త్రీ వీల్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ని తీసుకొచ్చింది. మూడు చక్రాలతో ఉండే ఈ స్కూటర్‌లో ముందు సీటూ, వెనక సీటూ హాయిగా ఆనుకుని కూర్చునేలా ప్రత్యేకంగా ఉంటాయి. మిగతా ఎలక్ట్రిక్ స్కూటర్ల ఫీచర్లతోపాటు పెద్దవాళ్లు కూర్చోవడానికి సౌకర్యంగా ఉండటమే ఈ బండి అసలైన ప్రత్యేకత!



ఆరోగ్యాన్ని చెప్పే ఉంగరం!

పెద్దాచిన్నా సంబంధం లేకుండా ఫిట్‌నెస్, ఆరోగ్య వివరాల కోసం స్మార్ట్ వాచీలూ, రింగులూ వాడుతున్నారు. అందులోనూ రోజంతా పెట్టుకునేందుకు వీలుగా ఉండే స్మార్ట్ ఉంగరాలు- చాలావరకూ వయసు మీద పడినవారికి ఎంతో ఉపయోగపడతాయి. శరీర ఉష్ణోగ్రత దగ్గర్నుంచీ హార్ట్‌రేట్ వరకూ మొత్తం హెల్త్ రికార్డును చూపిస్తాయివి. నిద్రనీ, ఒత్తిడినీ మానిటర్ చేస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలూ అందిస్తాయి. దీంతో ఆరోగ్యం మీద పూర్తి అవగాహన రావడమే కాదు, డాక్టర్‌ని సంప్రదించినప్పుడు ఆ వివరాల్ని పంచుకోవడమూ సులభతరమే అవుతుంది. ఇంకా 'నిమ్ స్మార్ట్ రింగ్' లాంటి వాటిల్లో పర్సనల్ సేఫ్టీ ఫీచర్స్ కూడా ఉంటాయి. అత్యవసర సమయాల్లో దీంట్లో ఉన్న పానిక్ బటన్ నొక్కితే, కుటుంబ సభ్యులకు సమాచారం అందుతుంది.



కనిపించనివి వినిపిస్తాయి!

వయసు పెరుగుతున్న కొద్దీ చూపు మందగించడం వంటి సమస్యలూ చాలానే ఇబ్బందిపెడుతుంటాయి పెద్దవాళ్లని. వాటిని అధిగమించడానికి అవసరానికి తగ్గట్టు కళ్లజోడును వాడుతుంటారు. ఆ సాదా అద్దాలకు బదులు చూపుతోపాటు మరెన్నో విధాలుగా సాయం చేయడానికి ఈమధ్య ఏఐ టెక్నాలజీతో పనిచేసే గ్లాసెస్ వస్తున్నాయి. ఈ స్మార్ట్ కళ్లజోళ్లలో వాయిస్ కంట్రోల్, టచ్, బ్లూటూత్, హెల్త్ ట్రాకింగ్ ఫీచర్లెన్నో ఉంటాయి. వివిధ కంపెనీలు సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేకంగా వీటిని తీసుకొస్తున్నాయి. వాటిల్లో 'ఎన్‌విజన్ గ్లాసెస్' ఒకటి. పత్రికలూ, పుస్తకాలూ, బిల్లుల్లాంటివి చదువుతున్నప్పుడు చిన్న అక్షరాలు మసగ్గా కనిపిస్తే వాటిని స్కాన్ చేసి ఇది గట్టిగా చదివి వినిపిస్తుంది. ఇంకా కళ్లజోడుతోనే ఫోన్ కూడా చేసుకోవచ్చు. కెమెరా, కలర్ సెన్సర్లూ, ఆడియో, మైక్రోఫోన్స్‌తో ఉండే ఈ స్మార్ట్ కళ్లజోడు- కచ్చితంగా పెద్దవాళ్లకు ఉపయోగకరమే. ఇంకా ఏదైనా కళ్లజోడుకి అమర్చుకునేలా 'ఓర్‌క్యామ్ రీడ్ స్మార్ట్ డివైజ్' వచ్చింది. ఏఐ సాంకేతికతతో పనిచేసే ఈ పరికరం కూడా వాయిస్ కమాండ్ ఇస్తే మసగ్గా కనిపించేవాటి వివరాలన్నీ చెబుతుంది. ఇంకా మతిమరుపుతో ఇబ్బంది పడేవాళ్లను ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తూ, చేసే పనుల్ని గుర్తుకు చేసే ఫీచర్లతో స్మార్ట్ ఎల్డర్ గ్లాసెస్ కూడా ఉన్నాయి!



ఇవి కాస్త భిన్నమే!

నీరసంగా ఉన్నా, ఒంట్లో బాగోకపోయినా రోజువారీ పనులే కష్టంగా అనిపిస్తాయి. అందుకే పెద్దవాళ్లకోసమే కొన్ని వస్తువుల్ని ప్రత్యేకంగా తీసుకొస్తున్నారు తయారీదారులు. ఇక్కడున్న టూత్‌బ్రష్, స్పూన్, నెయిల్ కటర్ అలా వచ్చినవే. బ్రష్ చేసుకోవడానికి చేతిలో పట్టు లేకపోయినా ఈ 'గ్రిప్ టూత్‌బ్రష్, స్మార్ట్ బ్రష్' చాలానే ఉపయోగపడతాయి. ఎలక్ట్రిక్ స్మార్ట్ టూత్ బ్రష్ బటన్‌నొక్కి నోట్లో పెట్టుకుంటే, గుండ్రంగా తిరుగుతూ దంతాల్ని తేలికగా శుభ్రం చేసేస్తుంది. ఇంకా గోళ్లు కత్తిరించుకునేప్పుడూ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గోరుతోపాటు చిగురు కూడా కట్ అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే మ్యాగ్నిఫయింగ్ గ్లాస్ నెయిల్ క్లిప్పర్స్ ఉన్నాయి. పెద్దగా కనిపించే ఆ అద్దంలోంచి చూస్తూ భయం లేకుండా గోళ్లు కత్తిరించుకోవచ్చు. అంతేకాదు, పార్కిన్సన్స్ లాంటి వ్యాధితో ఇబ్బందిపడేవాళ్ల కోసం 'యాంటీ షేక్ స్పూన్స్, ఫోర్క్స్' లాంటివీ వచ్చాయి. చేతులు వణికినా స్పూన్లోని ఆహారం కిందపడిపోదు. వీటిల్లోని స్టెబిలైజింగ్ టెక్నాలజీ వల్ల కాస్త మందంగా ఉండే హ్యాండిల్ కదులుతూ చెంచా స్థిరంగా ఉండేలా చేసి, అందులోని ఆహారాన్ని పడిపోకుండా చూస్తుందట.





షూలే రక్షణ కవచం!

సాయంకాలం స్నేహితులతో కలిసి సరదాగా నడవడానికో, వాకింగ్ చేయడానికో వృద్ధులు పార్కుకు వెళుతుంటారు. అలాంటప్పుడు చేతిలో ఫోన్‌లాంటిదేదీ తీసుకెళ్లకపోయినా వాళ్లు వేసుకున్న షూలే భద్రతనిచ్చేలా స్మార్ట్ షూలు వచ్చాయి. నడిచేప్పుడు సౌకర్యంగా ఉండటమే కాదు, ఇతర ఫీచర్లతోనూ ఉంటాయివి. 'ఈ-వోన్ స్మార్ట్ షూ'ల్లోని జీపీఎస్ సాంకేతికత ఆధారంగా వాళ్ల జాడను ట్రాక్ చేయొచ్చు. అనుకోకుండా పడిపోయినా దీంట్లో ఫాల్ డిటెక్షన్ ఆప్షన్ ఆ సమాచారాన్ని ఇంట్లో వాళ్లకు పంపిస్తుంది. రోజూ వాకింగ్‌కు వెళ్లే పెద్దవాళ్లకెంతో ఉపయుక్తంగా ఉంటాయివి.



ఇవేకాదు, పెద్దవాళ్ల అవసరాల్ని తీర్చడానికి నాన్‌స్లిప్ టైల్స్ దగ్గర్నుంచీ వాష్‌రూమ్స్, సేఫ్టీ పోల్స్, ఫర్నిచర్ వరకూ ఇంటీరియర్లో ఎల్డర్ స్పెషల్ సౌలభ్యాలెన్నో వచ్చేశాయి. ఇంకా సెక్యూరిటీ కెమెరాలు మొదలు కాలక్షేపానికి కబుర్లు చెప్పే రోబోట్‌ల దాకా మరెన్నో కృత్రిమ సాంకేతికతతో పనిచేసే వస్తువులూ అందుబాటులో ఉన్నాయి! ★

ఫుడ్ ట్రెండ్

‘బ్రెడ్డులో మైదా తప్ప మరేం ఉంటుంది... దాంతో అసలు ఎలాంటి పోషకాలూ అందవు’... అన్నమాటల దగ్గర్నుంచీ ‘ఈ బ్రెడ్డులో ఐరన్ ఉంటుంది... పొట్టలో ఇబ్బందా, అయితే రోజూ ఓ ప్రొ-బయోటిక్ బ్రెడ్డు ముక్క తినండి’ అని చెప్పే పరిస్థితి వచ్చింది ఇప్పుడు. అంతేనా... రకరకాల ఆకారాల్లోనూ, కమ్మటి రుచుల్లోనూ ఊరిస్తున్నాయి సరికొత్త బ్రెడ్డులెన్నో!



బ్రెడ్ పేపర్‌లా పల్చగా... ప్రొటీన్‌తో బలంగా!



ఇడ్లీ, దోశ, వడలతోపాటు బ్రెడ్డు కూడా మన టిఫిన్లలో భాగమైపోయింది. విదేశాల్లోలా బ్రెడ్డుని ఇష్టంగా తినేస్తున్నారు చాలామంది. పొద్దున్నే జామ్ రాసుకునో, నెయ్యి వేసి వేయించుకునో అయిదు నిమిషాల్లో బ్రెడ్ బ్రేక్‌ఫాస్ట్ చేసి పనులకు వెళ్లిపోతున్నారు. పిల్లలూ ఇష్టంగా తినేలా బ్రెడ్డుతో ప్రయోగాలు చేస్తుంటారు అమ్మలెందరో! మరి అందరికీ అంతగా ఫేవరెట్ అయిన బ్రెడ్డు సాదాగానే ఎందుకు ఉండాలి... విడిగా కూరగాయ ముక్కలూ, గుడ్డులాంటివి జత చేయకపోయినా వట్టి బ్రెడ్డు కూడా పోషకాలతో నిండి వస్తే ఎలా ఉంటుంది... అనుకున్నారేమో ఫుడ్ మాస్టర్లు- బ్రెడ్డునీ సూపర్ ఫుడ్‌గా మార్చేస్తున్నారు. కొత్త రూపాల్లో, కమ్మటి రుచుల్లో తీసుకొస్తున్నారు.

ఎన్ని రకాలో...

ఫ్యూజన్ ట్రెండ్స్‌లో భాగంగా వివిధ ప్రాంతాల్లోని ఆహారపదార్థాలూ అంతటా కనిపించేస్తున్నాయి. అందులో ఒకటి ‘కొరియన్ టిష్యూ బ్రెడ్’. నోట్లో పెట్టుకుంటే కరిగిపోయేలా సుతిమెత్తగా, పొరలుపొరలుగా ఉండే దీన్ని ‘పేపర్ బ్రెడ్’ అనీ ‘థౌజెండ్ లేయర్ బ్రెడ్’ అనీ పిలుస్తున్నారు. బటర్ రాస్తూ, మడతపెట్టడం వల్లే పలుచగా తయారవుతుందిది. ప్రత్యేకమైన ఈ పొరల బ్రెడ్డుకే నిమ్మ, మాచా, గార్లిక్, చాక్లెట్... తదితర రుచుల్నీ కలుపుతూ ‘పలుచగా రుమాలి రోటీలా ఉంది’ అంటూ లొట్టలేసుకుంటూ తినేస్తున్నారు ఫుడ్ లవర్స్. ఇంకా గార్లిక్, చీజ్‌లతో చేసే వెరైటీ రకం ‘పుల్ అపార్ట్ బ్రెడ్’. పెద్ద బ్రెడ్డులోనే ఒక్కో చిన్న ముక్క పైకి లాగి తినేలా ప్రత్యేకంగా ఉంటుంది. మంచి స్నాక్‌గా పేరు తెచ్చుకున్న ఇది రెస్టరంట్లూ, బేకరీల్లో దొరుకుతోంది. ఇవేనా... చిట్టి సైజులో మినీ బన్స్, అంగుళమంత పరిమాణంలో మినియేచర్ క్రోసెంట్ బ్రెడ్డులూ వచ్చాయి.

ఇలా కంటికి ఇంపుగా ఉండడమే కాదు, ఆరోగ్యాన్నీ ఇచ్చే బ్రెడ్ ట్రెండ్ బాగానే నడుస్తోంది. ఇదివరకు దీంట్లో మిల్క్, వీట్, మల్టీగ్రెయిన్ లాంటివే వచ్చేవి. ఆ తర్వాత రాగులూ, జొన్నలూ, క్వినోవా, ఓట్స్ వంటి చిరుధాన్యాలతో ప్రత్యేకంగా చేసినవీ... పండ్లూ, డ్రైఫ్రూట్స్ కలిపినవీ రకరకాల ఫ్లేవర్లలో తీసుకొచ్చారు. ఇక ఇప్పుడేమో ఫోర్టిఫైడ్ బ్రెడ్లకీ రూపమిస్తున్నారు. మామూలుగా ప్రొటీన్ ఫుడ్ కోసం గుడ్లూ, పప్పులూ, మాంసకృత్తుల్లాంటి వాటినే ఎక్కువగా ఎంచుకుంటారు. కానీ ఇప్పుడు ప్రత్యేకంగా ప్రొటీన్ బ్రెడ్డూ అందుబాటులో ఉంది. ఇంకా దీంట్లో ఐరన్, ఫైబర్, విటమిన్లను కూడా జోడిస్తున్నారు. వీటిని ఆయా పోషకాల లోపాల్ని సవరించడానికి గర్భిణులకూ, పిల్లలకూ అందించొచ్చు. అంతేకాదు... గట్ హెల్త్‌కు ఉపయోగపడే ల్యాక్టోబాసిల్లస్ లాంటి బ్యాక్టీరియాని కలిపి ప్రొ-బయోటిక్ బ్రెడ్డునీ, పొట్టలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను పెంచడానికి అవసరమైన పదార్థాలతో ప్రి-బయోటిక్ బ్రెడ్డునీ తయారు చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే బ్రెడ్డు కమ్మటి రుచితోపాటు అవసరమైన పోషకాల్నీ అందిస్తూ హెల్దీ స్నాక్‌గా మారిపోయింది, సరికొత్త ఆకారాల్లో తయారవుతూ తినకముందే నోరూరిస్తోంది! ★










అమ్మాయిలంటే తన తల్లిలా ఉండాలంటాడు దీపేశ్. తండ్రి అనారోగ్యానికి గురైతే క్యాటరింగ్‌లు చేస్తూ ఒంటిచేత్తో కుటుంబాన్ని నడిపారట ఆమె. చుట్టుపక్కలవాళ్లూ ఎంతో గౌరవించేవాళ్లట తనని. ప్రతి స్త్రీనీ సమాజం అలాగే చూడాలనుకున్నాడు దీపేశ్. కానీ వాస్తవం వేరు కదా! అందుకే- లోకల్ రైళ్లలో అమ్మాయిల్ని వేధించేవాళ్లకి వ్యతిరేకంగా ఓ ఉద్యమమే తెచ్చాడు. అమ్మాయిల్ని పడుపు వృత్తిలోకి దించుతున్నవాళ్లని ప్రాణాలకి తెగించి మరీ ఎదుర్కొన్నాడు. అతని సాహసం 'డియర్ మెన్' పేరుతో నేడో లఘుచిత్రంగా మారింది.





అబద్ధమని తెలిస్తే చంపేసేవాళ్ళే, కానీ...

అక్షరాలా ఆటవిక రాజ్యం అది. బిహార్‌లోని పట్నా దగ్గర ఓ కుగ్రామం. మనుషులకన్నా నాటు తుపాకులూ... మాటలకన్నా తూటాల చప్పుళ్లూ... ఎక్కువగా ఉంటాయక్కడ. దేశం నలుమూలల నుంచీ ఆడపిల్లల్ని పట్టుకొచ్చి పడుపువృత్తిలోకి దించుతుంటారు. అక్కడ అడుగుపెట్టడానికి స్థానిక పోలీసులూ జంకుతుంటారు. 2018 సెప్టెంబర్‌లో అక్కడికి ఓ తొమ్మిదేళ్ల పాపని తీసుకొచ్చారు. తనది నేపాల్. పొట్టచేతపట్టుకుని కూలిపనుల కోసమని వాళ్ల కుటుంబం పట్నాకి వస్తే... దుండగులు తనని కిడ్నాప్ చేశారు. దాంతో ఆ పాప పిన్ని ఓ ఎన్జీఓకి ఫోన్ చేసి కాపాడమని వేడుకుంది. దీపేశ్ టాంక్... ఆ సంస్థతో కలిసి పనిచేస్తుండేవాడు. ఆ పాపని రక్షించడం కోసం అతనో వ్యూహం పన్నాడు. తన బృందంతో కలిసి ఆ గ్రామానికి వెళ్లి 'నేను బాలీవుడ్ క్యాస్టింగ్ డైరెక్టర్‌ని. ఓ పాట సీను కోసం ఎనిమిదీ తొమ్మిదేళ్ల వయసున్న ఆడపిల్లలు కావాలి. రోజుకి పదివేలిస్తాం' అన్నాడట. అది అబద్ధమని ఏ చిన్న అనుమానం వచ్చినా అక్కడి గూండాలు దీపేశ్‌నీ అతని బృందాన్నీ చంపేసేవాళ్ళే కానీ... వాళ్లు ఆ నాటకాన్ని నమ్మారు. తమ దగ్గరున్న ఆడపిల్లలు ఒక్కొక్కర్నే చూపిస్తుంటే... దీపేశ్ తన కళ్లద్దాల్లోని రహస్య కెమెరాతో రికార్డు చేసి... జిల్లా ఎస్పీకి పంపించసాగాడు. అక్కడున్న రెండురోజుల్లో నేపాలీ చిన్నారిని బంధించిన రహస్య గదినీ పసిగట్టాడు. మూడోరోజు రాత్రి ఎస్పీ రాకతో... అక్కడ అసలైన 'యాక్షన్' చోటుచేసుకుంది. నేపాలీ చిన్నారితో సహా పదిమంది ఆడపిల్లలకి విముక్తి దొరికింది.

- ఈ సంఘటనే 'డియర్ మెన్' లఘుచిత్రానికి స్ఫూర్తిగా నిలిచింది. కీత్ గోమ్స్ అనే అంతర్జాతీయ దర్శకుడు దీన్ని రూపొందించాడు. ఈ లఘుచిత్రం ఇటీవల యూట్యూబ్‌లో విడుదలై ఎంతో సంచలనం సృష్టించడమే కాదు, దీపేశ్ టాంక్ సాహసాలనీ వెలుగులోకి తెచ్చింది. దీపేశ్ 2016 నుంచీ ఇలాంటి ఎన్నో ప్రయత్నాలతో మూడొందల మందికిపైగా చిన్నారుల్ని వ్యభిచార రొంపి నుంచి రక్షించాడు. ఇంతకీ అతనేమీ పోరాట కళలు నేర్చుకున్నవాడో, పోలీసు ఇన్‌ఫార్మరో కాదు. మనలాంటి అతిసామాన్యుడు. కాకపోతే, మహిళల శ్రేయస్సుపట్ల మమకారం ఉన్నవాడు!

అమ్మే స్ఫూర్తి

దీపేశ్‌ది ముంబయి దగ్గర్లోని పార్లె అనే ప్రాంతం. తండ్రి భవన నిర్మాణ మేస్త్రీగా ఉండేవాడు. కానీ ప్రోస్టేట్‌లో ట్యూమర్ వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో ఆయన తల్లి రేఖా టాంక్ కుటుంబ బాధ్యతలు తీసుకుంది... క్యాటరింగ్ బిజినెస్ చేసేది. హుందాగా గంభీరంగా ఉండే తనని చుట్టుపక్కలవాళ్లందరూ ఎంతో గౌరవించేవారట. 'అది చూస్తూ పెరిగినందువల్లనేమో ప్రతివాళ్లూ అమ్మాయిల్ని గౌరవించి తీరాలన్న భావన నాలో ఏర్పడింది. నేను కాస్త పెద్దయ్యాక అమ్మకి ఆర్థికంగా తోడు నిలవాలని కాలేజీ మానేసి ఆఫీస్‌బాయ్‌గా పనికి కుదిరాను. అదో హార్డ్‌వేర్ కంపెనీ. వాళ్ల దగ్గర పని నేర్చుకుని హార్డ్‌వేర్ నిపుణుడిని అయ్యాను. అప్పట్లో రోజూ ఆఫీసుకి ముంబయి లోకల్ రైళ్లలో వెళ్లేవాణ్ణి. అందులో ఆకతాయిలు అమ్మాయిల్ని వేధించడం చూసి తట్టుకోలేక అడ్డుపడేవాణ్ణి. రైల్వే పోలీసుల దగ్గర కంప్లైంట్ ఇచ్చేవాణ్ణి. వాళ్లు పట్టించుకునేవాళ్లు కాదు. దాంతో, నేను మా ఫ్రెండ్స్‌తో కలిసి రైళ్లలో అమ్మాయిల భద్రతపైన ఓ సర్వే చేశాను. 80 శాతం అమ్మాయిలు తాము భద్రంగా లేమని చెప్పిన ఆ అధ్యయనం వివరాల్ని రాష్ట్రపతికి పంపించాము. అక్కణ్నుంచి తాఖీదులు వచ్చాక రైల్వే పోలీసులు మాతో కలిసి పనిచేయడానికి ముందుకొచ్చారు. అప్పుడే నా మిత్రులతో కలిసి 'వార్ ఎగైనెస్ట్ రైల్వే రౌడీస్'(వార్) అనే ఉద్యమాన్ని ప్రారంభించాను. నేనూ నా మిత్రులం రైళ్లలో వెళుతూ అమ్మాయిలపైన జరిగే ఆగడాలని రహస్యంగా వీడియోతీసి... రైల్వే పోలీసులకి పంపేవాళ్లం. పోలీసులు అప్పటికప్పుడు- అంటే ఆ తర్వాతి స్టేషన్‌లలోనే వాళ్లని అదుపులోకి తీసుకునేవారు. అలా మా ఉద్యమంతో అమ్మాయిలపైన వేధింపులు 80 శాతం తగ్గాయి...' అంటాడు దీపేశ్.

'వార్'తోపాటే నిరుపేదపిల్లల చదువుకీ సాయపడాలన్న ఆలోచనతో 'యూత్ ఫర్ పీపుల్'ని స్థాపించాడు దీపేశ్. ఆ పనుల్లో భాగంగా ఓ పునరావాస కేంద్రానికి వెళితే అక్కడ 16 ఏళ్ల బాలిక గర్భంతో ఉండటం చూశాడట. తన గురించి ఆరా తీసినప్పుడే ఓ పడుపు వృత్తి ముఠా గురించి తెలిసింది. ఆనాటి నుంచీ అలాంటి ముఠాలపైన పోరాటం మొదలుపెట్టి వందలాది చిన్నారుల్ని కాపాడాడు. దీపేశ్ సేవల్ని మెచ్చి- మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గవర్నర్ శక్తి' అవార్డుని అందించింది! ★



తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్ళే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ మరికొద్దిసేపట్లో ప్లాట్‌ఫారం పైకి వస్తుందన్న అనౌన్స్‌మెంట్ విని ఉలిక్కిపడింది సౌందర్య. 'సుందర్ ఇంకా రాలేదు' అనుకుంది. చేతిలోని హ్యాండ్‌బ్యాగ్‌ని గట్టిగా రెండు చేతులతో పట్టుకుని చుట్టూ చూసింది. సుందర్ ఎక్కడా కనిపించలేదు. తల్లిదండ్రులకు చెప్పకుండా ఊరు వదిలి వెళ్తున్నందుకు ఆమెకు ఎంతో బాధగా మరెంతో భయంగా ఉంది. ఇప్పుడు సుందర్ కనపడకపోవడంతో ఆమెకి మనసులో ఏ మూలో ఆశ మొదలైంది.

'సుందర్ రాకపోతే తను ఇంటికి వెళ్ళిపోవచ్చు. అమ్మానాన్నలు ఎక్కడికెళ్ళావని అడిగితే ఏదో ఒక కారణం చెప్పి నమ్మించవచ్చు. తనను రమ్మని చెప్పి అతను రాకపోవడం సుందర్ తప్పు కనుక తనను నిందించడు' అనుకుంది.

ఆ ఆలోచన రాగానే ఆమెకి నిశ్చింతగా అనిపించింది.

ఇంతలో ట్రైను వచ్చి ప్లాట్‌ఫారం పైన ఆగింది. తను ఎక్కవలసిన 'ఎస్-టూ' కంపార్ట్‌మెంట్ తన ఎదురుగానే ఉంది. ఆమె బెంచీపైనే కూర్చుని ఉరుకులు పరుగులు పెడుతూ ట్రైను వైపు వస్తున్న ప్రయాణికులను చూస్తూ ఉండిపోయింది.

గార్డ్ విజిల్ ఊదాడు. సుందర్ ఇక రాడని నిశ్చయించుకుని ఆమె లేచి నిలబడింది. అప్పుడు మోగింది ఆమె ఫోన్.

సుందర్ చేస్తున్నాడు. వెంటనే కాల్ రిసీవ్ చేసుకుని "సుందర్... ఎక్కడున్నావ్?" అని అడిగింది.

"ముందు నువ్వు ట్రైను ఎక్కు" అన్నాడు సుందర్.

"నువ్వు..?"

"నేను జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఉన్నాను. తెలిసినవాళ్ళు మనిద్దరినీ చూస్తే ఇబ్బందవుతుంది. నేను కావలిలో నీ దగ్గరికి వస్తాను. త్వరగా ఎక్కు."

ఆమెకు ఆలోచించడానికి కూడా సమయం దొరకలేదు. పరుగున వెళ్ళి ట్రైను ఎక్కేసింది.

కావలిలో సుందర్ ఆమెని కలుసుకున్నాక అంతవరకూ ఆమెలో ఉన్న ఆందోళన మాయమైంది. అతనితో కబుర్లు చెబుతూ ఉత్సాహంగా గడిపింది.

★ ★ ★

బెర్తుపై పడుకుని ఉన్న సౌందర్యకు నిద్ర పట్టలేదు. సుందర్ వైపు చూసింది. అతను మంచి నిద్రలో ఉన్నాడు. ఆమెకి తన తల్లిదండ్రులు పదే పదే గుర్తుకు వస్తున్నారు.

'అమ్మానాన్నా తను ఇంటికి రాకపోవడంతో బాగా కంగారుపడి ఉంటారు. నాన్న తనను వెతుకుతూ స్కూటర్‌పైన ఊరంతా తిరుగుతూ ఉంటాడు. తన స్నేహితురాళ్ళ ఇళ్ళకు పరుగులు పెడుతూ ఉంటాడు. అమ్మ తను నమ్మే దేవుళ్ళకు మొక్కుకుంటూ

విజేత

- సి.ఎన్.చంద్రశేఖర్



ఉంటుంది.'

సౌందర్యకి అమాయకంగా కనిపించే తన తల్లి ముఖం గుర్తొచ్చింది. మాటలతోకన్నా తన చేతలద్వారా ఎక్కువ ప్రేమని చూపే తండ్రి గుర్తొచ్చాడు... ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

నిజానికి తల్లికంటే తండ్రితోనే తనకు బంధం ఎక్కువ. చిన్నప్పట్నుంచీ- ఆయన ఎక్కడికి వెళ్ళినా తనను కూడా స్కూటర్‌పైన ఎక్కించుకుని వెళ్ళేవాడు. స్నేహితుల ఇళ్ళకూ గుళ్ళకూ మార్కెట్‌కూ సినిమాలకూ... ఇలా ఆయన వెళ్ళే ప్రతిచోటికీ తనని వెంటేసుకుని వెళ్ళేవాడు. వ్యాయామం కోసం ఉదయంపూట ఓ క్లబ్‌లో షటిల్ ఆడేవాడు. స్కూలు సెలవురోజుల్లో అక్కడికి తనని తీసుకుని వెళ్ళేవాడు. అందరూ ఆడటం అయిపోయాక తనతో కొంతసేపు ఆడేవాడు.

ఇంటర్‌లో తను బైపీసీ గ్రూపు తీసుకుంటాననీ తనకు డాక్టర్ కావాలని ఉందనీ చెబితే నాన్న సరేనన్నారు. నాన్న చేస్తున్నది ప్రైవేటు ఉద్యోగం. ఆ గ్రూపు చదవడానికీ, తర్వాత కోచింగులకూ, ఆ తర్వాత మెడిసిన్ చదవడానికీ ఎంతో ఖర్చవుతుందని తెలిసినా తన కోరికని కాదనలేదు.

కాలేజీలో రోజూ రెగ్యులర్ క్లాసులు అయ్యాక ఎంసెట్ కోచింగ్ క్లాసులు ఉండేవి. నాన్న సాయంత్రం కాలేజీ దగ్గరికి వచ్చి తనకు తినడానికి ఏదో ఒకటి ఇచ్చేవాడు. తన కాలేజీ నాన్న ఆఫీసు నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు ఉండేది. అయినా శ్రమ అనుకోకుండా వచ్చేవాడు. తర్వాత రాత్రి తొమ్మిది గంటల వరకూ అక్కడే ఎక్కడో తిరుగుతూ ఉండేవాడు. తన క్లాసులయ్యాక తనని స్కూటర్ మీద ఇంటికి తీసుకెళ్ళేవాడు.

ఎంట్రన్స్‌లో సరైన ర్యాంకు రాకపోవడంతో చాలా డీలా పడింది తను. అప్పుడు అమ్మానాన్నలు తననెంతో ఊరడించారు. బాధ మరచిపోవడానికి రోజూ తనని బయటకు తీసుకెళ్ళేవారు. నాన్న ఎక్కువ సమయం తనతోనే గడిపేవాడు. తను ఆత్మవిశ్వాసం కోల్పోకుండా స్ఫూర్తిదాయకమైన విషయాలు ఎన్నో చెప్పేవాడు. తను తొందరగానే ఆ బాధనుంచి బయటికివచ్చి బీఎస్సీలో చేరింది.

తమ ఇంటి పక్కనున్న ఖాళీ స్థలం శుభ్రం చేయించి- షటిల్ కోర్టు తయారుచేసి- తనతో, తల్లితో షటిల్ ఆడేవాడు నాన్న. తను బాగా ఆడటం గమనించి టౌన్లో జరిగే టోర్నమెంట్లకు తీసుకెళ్ళి ఆడించేవాడు. క్రమంగా తను ఊర్లో మంచి షటిల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

నాన్న తనకు స్కూటీ కొనిచ్చి డ్రైవింగ్ నేర్పించాడు. తర్వాత నాన్నకు ఆఫీసు ఉన్న సమయాల్లో తనే స్కూటీ డ్రైవ్ చేసుకుంటూ షటిల్ ప్రాక్టీస్‌కు వెళ్ళేది.

ఎక్కువమంది ప్లేయర్లతో ఆడితే తన ఆట మరింత మెరుగవుతుందని ఓ స్పోర్ట్స్ క్లబ్‌లో తనని చేర్పించాడు నాన్న. అక్కడ పరిచయమయ్యాడు సుందర్. అతను తరచుగా క్లబ్‌కు వచ్చి క్యారమ్స్ ఆడేవాడు. తనతో పరిచయమయ్యాక షటిల్ ఆడేవాడు. ఒక్కోసారి తనతో ఆడేవాళ్ళు ఎవరూ లేకుండా ఖాళీగా కూర్చుని ఉంటే సుందర్ 'నేను వస్తాను పదండి... మీకు ప్రాక్టీస్ అవుతుంది' అంటూ వచ్చేవాడు.

అతి త్వరలోనే అతను స్నేహితుడిగా మారాడు. మరికొద్దిరోజుల్లో ప్రేమికుడయ్యాడు. తను బీకాం చదువుతున్నాననీ తమది మధ్యతరగతి కుటుంబమనీ బిజినెస్ చేసి కోటీశ్వరుడు

కావడం తన జీవిత ధ్యేయమని చెప్పేవాడు. భార్యని కార్లలో, విమానాల్లో తిప్పడం తన ఆశయమని చెప్పాడు. ఓ రోజు అతను ప్రపోజ్ చేయగానే తను ఓకే చెప్పేసింది. అప్పుడు ఎందుకో తనకు తల్లీ తండ్రీ గుర్తుకురాలేదు.

సుందర్‌తో ఉంటే సమయం ఎలా గడుస్తుందో తెలిసేదే కాదు. అతనికోసం ఆత్రుతగా ఎదురుచూడటం... అతను రాగానే సంతోషపడిపోవడం... అతను ప్రేమకబుర్లు చెబుతుంటే మురిసిపోవడం... అతను వెళ్ళిపోతుంటే డీలాపడిపోవడం... రాత్రంతా అతని గురించే ఆలోచించడం... ఉదయం లేవగానే మళ్ళీ అతన్ని కలవబోతున్నానన్న ఆనందంతో క్షణాలు యుగాల్లా గడపడం అలవాటయిపోయింది.

తన ప్రేమ విషయం తండ్రితో చెప్పడానికి చాలాసార్లు ప్రయత్నించి విరమించుకుంది. ఆయన ఎంత క్లోజ్‌గా ఉన్నా ఒక్కోసారి సీరియస్‌గా ఉండేవాడు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేవాడు కాదు. అందుకే ఆ ధైర్యం చేయలేకపోయింది.

ఓరోజు సుందర్ తనతో 'మా నాన్న నీ గురించి చెప్పగానే ఉగ్రుడైపోయాడు. తన మేనకోడలితో నా పెళ్ళి చేయాలని పెద్దలు ఏనాడో డిసైడ్ అయ్యారట. 'పిచ్చివేషాలేస్తే తాట తీస్తా. ఆ అమ్మాయి ఇంటికెళ్ళి ఆమె పెద్దల్ని కడిగేసివస్తా'నంటూ బయలుదేరారు. నేను కాళ్ళు పట్టుకుని ఆపాను' అన్నాడు.

తను షాక్‌తిన్నట్టు చూస్తూండిపోయింది.

'మీ నాన్న చాలా స్ట్రిక్ట్ అని చెప్పావు. ఆయన కులాంతర వివాహానికి ఒప్పుకోకపోవచ్చు. మనిద్దరం హైదరాబాదుకెళ్ళి గుడిలో పెళ్ళి చేసుకుని, కొంతకాలం తర్వాత తిరిగొస్తే అప్పటికి పెళ్ళయిపోయి ఉంటుంది కాబట్టి మన పెద్దలు ఇంకేమనలేక మనల్ని తమతో కలుపుకుంటారు. పైగా ఇద్దరూ పరువుకోసం పాకులాడేవాళ్ళే కాబట్టి మరోసారి మనకు పెళ్ళికూడా చేస్తారు' అన్నాడు నవ్వుతూ.

'ఒకవేళ వాళ్ళు అలా మనల్ని క్షమించకపోతే?'

'అప్పుడు హైదరాబాదుకే వెళదాం. అక్కడ నాకు స్నేహితులు ఉన్నారు. చేతిలో డిగ్రీలు ఉన్నాయి కాబట్టి మనకు ఉద్యోగాలు చూసిపెడతారు' అన్నాడు.

తాను ఒప్పుకుంది. అంతేకాదు, అతని ప్రోద్బలంతో ఇంట్లోని నగలు కూడా తీసుకుని తన బ్యాగులో పెట్టుకుంది.

ట్రైను ఏదో స్టేషన్‌లో ఆగినట్లుంది. సుందర్ ఆమె దగ్గరికొచ్చి ఆమె చెవిలో "బ్యాగు జాగ్రత్త" అని చెప్పడంతో ఆలోచనల్నుంచి బయటకు వచ్చి, నగలున్న బ్యాగుని తన గుండెలకు హత్తుకుని, దుప్పటి కప్పుకుని నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది సౌందర్య.

★ ★ ★

వారంరోజుల తర్వాత ఓ రోజు...

హోటల్ గదిలో నిద్రపోతున్న సౌందర్య కాలింగ్‌బెల్ మోగిన శబ్దానికి నిద్రలోంచి మేల్కొని తలుపు తీసింది. ఎదురుగా రూమ్‌బాయ్ నిలబడి ఉన్నాడు. ఏమిటన్నట్టు చూసింది అతనివైపు.

"సార్, రూము బిల్లు కట్టేశారు. మీరు ఎనిమిది గంటలకు గది ఖాళీ చేస్తారని సార్ చెప్పారు" అన్నాడు అతను.

"సార్ కింద ఉన్నారా?"

"లేదు మేడమ్. ఆయన లగేజీ తీసుకుని వెళ్ళిపోయారు."

నెత్తిన బాంబు పేలినట్లు ఫీలయింది సౌందర్య. ఆ రూమ్‌బాయ్ ముందు అవమానంగా కూడా అనిపించింది.

"నేను లగేజీ సర్దుకున్నాక ఫోన్ చేస్తాను" అంటూ తలుపేసింది.



ఆమె ఇంకా షాకులోనే ఉంది. సుందర్ ఎక్కడికి వెళ్ళాడు? వెళుతున్నట్లు తనకెందుకు చెప్పలేదు. ఒకవేళ అర్జెంటుగా వెళ్ళవలసి వచ్చినా తర్వాతైనా తనకు ఫోన్ చేసి ఉండొచ్చుగా.

వెంటనే డ్రెస్సింగ్ టేబుల్‌పైన ఉన్న మొబైల్‌ని అందుకుని సుందర్‌కు కాల్ చేసింది. సెల్ స్విచ్ఛాఫ్ చేసి ఉందని బదులొచ్చింది.

కొంతసేపు 'ఏం చేయాలా' అని ఆలోచిస్తూండిపోయింది. ఎందుకో ఆమె మనసు కీడు శంకించింది. సుందర్ ఇక రాడని మనసు చెబుతోంది. 'చిన్నప్పట్నుంచీ తను క్లాసులో ఫస్ట్ వచ్చేది. టీచర్లూ బంధువులూ స్నేహితులూ అందరూ తన తెలివితేటలను మెచ్చుకునేవారు. మరి సుందర్ విషయంలో తన తెలివితేటలు ఏమయ్యాయి? ప్రతి విషయంలోనూ మంచీ చెడూ బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకునే తను ఎందుకు ఇలాంటి తప్పుడు నిర్ణయం తీసుకుంది? సుందర్ 'హైదరాబాదుకు వెళ్దాం' అనగానే తను ఎందుకు వద్దని గట్టిగా చెప్పలేకపోయింది? వయసు ప్రభావమా లేక ప్రేమ మైకమా?' అనుకుని బాధపడింది.

ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవడమో లేక జనారణ్యంలోకి వెళ్ళి బతుకును కుక్కలు చింపిన విస్తరి చేసుకోవడమోకన్నా... తిరిగి తన తల్లిదండ్రుల దగ్గరికే వెళ్ళి, వారిని క్షమాపణ వేడి, భవిష్యత్తులో వారికి ఎటువంటి క్షోభా కలిగించనంటూ మాటివ్వాలని నిర్ణయించుకుంది. తర్వాత లేచి తన దగ్గర ఉన్న డబ్బులు ఊరికి వెళ్ళడానికి సరిపోతాయో లేదోనని హ్యాండుబ్యాగు తెరచి చూసిన ఆమె షాక్ తిన్నట్టు కూర్చుండిపోయింది.

హ్యాండుబ్యాగులో- తను తెచ్చిన నగలు లేవు.

★ ★ ★

వైజాగ్ నగరంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందిన 'దివ్య హాస్పిటల్'లోని విజిటర్స్ లాంజ్‌లో కూర్చుని ఉన్నాడు సుందరమూర్తి. అతని భార్య విద్యాధరి ఆపరేషన్ థియేటర్‌లో ఉంది. మరికాసేపట్లో ఆమెకి సర్జరీ జరగబోతోంది. పేదవాళ్ళ హాస్పిటల్‌గా పేరున్నా, పేరొందిన డాక్టర్లు అందులో పనిచేస్తూండటం, దేశంలోనే మంచి హాస్పిటల్‌గా పేరు పొంది ఉండటం వల్ల అతను తన భార్యని ఇక్కడ చేర్పించాడు. చాలా హాస్పిటల్స్‌లో చూపించినా వ్యాధి నయంకాక, చావుతో పోరాడుతున్న ఆమెకి ఇక్కడ సరైన వైద్యం లభిస్తుందనే నమ్మకంతో ఉన్నాడు.

దాదాపు రెండుగంటలసేపు అక్కడున్న మ్యాగజైన్స్ తిరగేసిన అతను, కాఫీ తాగి వద్దామని బయలుదేరుతూంటే ఎదురుగా దాదాపు యాభై యాభైఅయిదు ఏళ్ళ మధ్య వయసున్న స్త్రీ కనిపించింది. ఆమెని చూసి 'ఈమె సౌందర్యలా ఉందే' అనుకుంటూ ఆమెవైపు పరిశీలనగా చూశాడు. అంతలో ఆమె అతన్ని చూసి పలకరింపుగా నవ్వింది.

"హాయ్ సౌందర్యా!" అన్నాడు ఆమె ఇక్కడికెలా వచ్చిందని ఆశ్చర్యపోతూ. ఇంతలో ఓ గదిలోంచి నర్సు వచ్చి "సిస్టర్" అని పిలవడంతో "ఆ... వస్తున్నా" అంటూ ఆ గదిలోకి వెళ్ళిపోయింది సౌందర్య.

'సౌందర్య ఇంకా చాలా అందంగానే ఉంది. ఆమె తనని ప్రేమించింది కానీ తను ప్రేమించలేదు. ప్రేమించినట్లు నటించాడు... అంతే! పాపం తనను నమ్మి హైదరాబాదుకు వచ్చేసింది. వారం రోజులు ఆమెతో గడిపి, ఆమె తెచ్చిన నగలు తీసుకుని చెప్పకుండా వచ్చేశాడు తను. అక్కడ్నుంచి నేరుగా విజయవాడ వెళ్ళి, ఆ నగలు అమ్మి, వచ్చిన డబ్బుతో చిన్న వ్యాపారం మొదలుపెట్టాడు. క్రమంగా బిజినెస్ పెరిగి, కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. అలా పరిచయమైన ఓ పెద్ద కాంట్రాక్టర్ అతని కూతుర్నిచ్చి పెళ్ళి చేశాడు. అప్పట్నుంచీ మరింత ఎదిగి ఇప్పుడు

తను విజయవాడలోనే నంబర్ వన్ కాంట్రాక్టర్‌గా ఉన్నాడు.

తను వ్యాపారం ప్రారంభించాక సౌందర్య గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే వయసు మీదపడుతున్న సమయంలో సౌందర్య గుర్తుకు వచ్చింది. ఆమెకి తను చేసిన అన్యాయం గుర్తొచ్చింది. భార్య అనారోగ్యం పాలవడంతో తనలో పాపభీతి మొదలైంది. ఆమె కనిపిస్తే పాపపరిహారంగా కొంత డబ్బు ముట్టజెప్పాలని తను అనుకున్నాడు. ఈరోజు అనుకోకుండా ఆమె కనిపించింది. ఆమెనుంచి తీసుకున్న నగలు ఆరోజు అమ్మితే లక్ష రూపాయలు వచ్చింది. బ్యాంకు వడ్డీ లెక్కవేసుకుంటే ఇప్పటికి ఆ సొమ్ము అయిదు లక్షల వరకూ ఉంటుంది. ఆ సొమ్ముకు చెక్కు రాసి సౌందర్యకి ఇస్తే తనకు పాపవిముక్తి కలుగుతుంది, నర్సుగా పనిచేస్తున్న ఆమెకు ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుంది' అనుకున్నాడు.

అంతలో గదిలోంచి బయటికి వచ్చిన సౌందర్య "రా సుందర్" అంటూ ఓ గదిలోకి తీసుకెళ్ళి కూర్చోమని చెప్పింది. పేషెంటు కుటుంబ సభ్యులతో డాక్టర్లు వ్యక్తిగతంగా మాట్లాడేందుకు కేటాయించిన గది అది. సౌందర్య ఎవరికో ఫోన్ చేసి కాఫీ తెమ్మని చెప్పింది. తర్వాత సుందర్ వైపు చూసి "చెప్పు సుందర్" అంది.

సుందర్ తను చేసిన పనికి పశ్చాత్తాపపడుతున్నట్లు ఆమెతో చెప్పాడు. పాపపరిహారంగా ఆమెకి అయిదు లక్షలు ఇవ్వాలనుకుంటున్నట్లు కూడా చెప్పాడు. సౌందర్య ఏం మాట్లాడకుండా- ఎదురుగా ఉన్న దినపత్రికలోని ఓ న్యూస్ ఐటమ్‌ని చూడమని ఇచ్చింది. చూసిన సుందర్ షాకయ్యాడు.

ఇటీవల విజయవాడలో వరదల వల్ల నష్టపోయిన వాళ్ళకోసం 'దివ్య హాస్పిటల్' ఎండీ సౌందర్య పాతిక లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందజేస్తున్న వార్తతోపాటు ముఖ్యమంత్రి పక్కన నిలబడి ఉన్న ఆమె ఫొటో కూడా వేశారు అందులో.

"ఈ హాస్పిటల్ నీదా?" ఆశ్చర్యంగా అడిగాడు. ఆమె అవునన్నట్లు తలూపింది.

"మరి నిన్ను 'సిస్టర్' అని పిలిచింది ఆ నర్సు?" అనుమానంగా అడిగాడు.

"నన్ను అలాగే పిలవమని అందరికీ చెప్పాను, ఎండీ హోదా నా తలకు ఎక్కకుండా."

ఇంతలో ఓ సిస్టర్ కాఫీ తెచ్చింది. ఇద్దరూ కాఫీ తాగసాగారు.

"నిన్ను ఇలా చూస్తానని అసలు ఊహించలేదు నేను" అన్నాడు. అతను ఇంకా షాకులోనే ఉన్నట్టు అర్థమైంది ఆమెకి.

"ఇంకెలా ఊహించావు సుందర్? మోసపోయినదాన్ని కాబట్టి ఇంట్లోవాళ్ళు తరిమేస్తే నాలుగిళ్ళలో పాచిపని చేసుకుంటూ నా బిడ్డని పెంచుకుంటూ ఉంటానని అనుకున్నావా... లేక ఒళ్ళమ్ముకుని బతుకుతూ జీవచ్ఛవంలా ఉంటాననుకున్నావా?"

"బిడ్డ?" మళ్ళీ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. నువ్వు వెళ్ళిపోగానే... కాదు కాదు... పారిపోగానే నేను ఇంటికి వెళ్ళాను. తలుపు తడితే మా నాన్న తలుపు తీసి ఇంట్లోకి రమ్మన్నారు. విషయం చెబితే నన్ను గుండెలకు హత్తుకున్నారు. అమ్మ ఎంతగానో ఓదార్చింది. జీవితంలో తప్పులు చేయడం సహజమే అంది. ఒక్క తప్పు చేసినంత మాత్రాన జీవితం చీకటి చేసుకోవలసిన అవసరం లేదంది.

మొదట్లో 'నీపై ఎలా పగ సాధించాలా' అని అనుక్షణం ఆలోచించేదాన్ని. మా నాన్న నా ఆలోచనల్ని తప్పుపట్టారు. 'నువ్వు పగ సాధిస్తే, ఇక తర్వాత ఇక సాధించడానికేమీ



ఉండదు. ఆ కసిని నువ్వు ఎదగడానికి ఉపయోగించు. అతనికంటే ఎత్తుకు ఎదిగాక కర్మ అతన్ని నీ దగ్గరికి రప్పిస్తుంది. నిన్ను చూసి తల దించుకునే పరిస్థితి అతనికి వస్తుంది' అన్నారు. వాళ్ళిద్దరి ప్రోత్సాహంతో మెడిసిన్ ఎంట్రన్స్‌కి చదివాను. అప్పుడే నేను గర్భవతినని తెలిసింది. ఇల్లు కదలకుండా చదువుకుని వైజాగ్‌లోని ఓ మెడికల్ కాలేజీలో సీటు తెచ్చుకున్నాను. అమ్మానాన్నలు పాపను చూసుకుంటే నేను ఎంబీబీఎస్ పూర్తిచేశాను, ఎంఎస్ కూడా చేశాను. చిన్న క్లినిక్‌తో మొదలైన నా ప్రస్థానం ఇంత పెద్ద హాస్పిటల్‌కి ఎండీ అవడం వరకూ సాగింది. మా హాస్పిటల్‌లో పనిచేసే ఓ సహృదయుడైన డాక్టర్ నన్ను వివాహం చేసుకున్నారు."

ఆశ్చర్యంగా వింటూండిపోయాడు సుందర్.

"మా హాస్పిటల్‌కి వచ్చే అమ్మాయిల్లో నాలా మోసపోయి గర్భవతులైన అమ్మాయిలు ఉంటే ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చి వారికి పరిస్థితులతో ధైర్యంగా పోరాడటం నేర్పిస్తున్నాను. ఆర్థికంగా వెనుకబడి ఉంటే నా సహాయ సహకారాలు అందించి వారు ఉన్నత స్థాయికి చేరేలా చూస్తున్నాను. అలా నేను ప్రోత్సహించినవారంతా ఈరోజు డాక్టర్లుగా ఇంజినీర్లుగా కలెక్టర్లుగా పనిచేస్తున్నారు."

"నిన్ను మోసం చేశానని నా మీద కోపంగా లేదా?"

"అయ్యో, నువ్వు మోసం చేయడం ఏమిటి సుందర్? నువ్వు నా గురువువి. నాకు ఎన్ని పాఠాలు నేర్పావు... మనుషుల్ని గుడ్డిగా నమ్మకూడదని నేర్పించావు. పైకి ప్రేమ చూపుతూనే అదను చూసి కాటేసే విషసర్పాల్లాంటి మనుషులు ఎలా ఉంటారో చూపించావు. డబ్బు దగ్గర నిర్లక్ష్యం ఉండకూడదని నేర్పావు. కనిపెంచిన తల్లిదండ్రులను మోసం చేయకూడదని తెలియచెప్పావు. నువ్వు చేసిన పనివల్ల జీవితంలో ఎలా పోరాడాలో నేర్చుకున్నాను, ఓ ధ్యేయం ఏర్పరచుకుని ఎలా ఎదగాలో నేర్చుకున్నాను. నువ్వు నన్ను వదిలి వెళ్ళకుండా ఉండి ఉంటే, నీతో జీవితం పంచుకోవడంతోపాటు నీ పాపాలు కూడా నేను పంచుకోవలసి వచ్చేది. ఆ పాపాల నుండి నన్ను కాపాడిన నీపైన నాకు కోపం ఎందుకు ఉంటుంది సుందర్? అసలు నువ్వు ఆరోజు అలా వదిలి వెళ్ళిపోకుంటే నేను ఈరోజు ఇలా ఉండేదాన్నా? అందుకే నువ్వంటే నాకు గౌరవం" నిర్మలంగా నవ్వుతూ అంది సౌందర్య.

ఇంతలో తెల్లని కోటు ధరించి, మెడలో స్టెతస్కోపుతో "అమ్మా" అంటూ ఆ గదిలోకి రాబోతూ గుమ్మం దగ్గరే ఆగిపోయిన యువతిని చూసి "రా దివ్యా, ఏమిటి విషయం?" అని అడిగింది సౌందర్య.

"కంగ్రాట్స్ అమ్మా! విద్యాధరిగారికి స్పృహ వచ్చిందట. డాక్టర్ పరిమళ ఫోన్ చేసి చెప్పింది. ఆవిడ భర్త కదా ఈయన?" అని అడిగింది ఆ అమ్మాయి సుందర్‌ను చూస్తూ.

ఆ వార్త వినగానే అతని ముఖం ఆనందంతో నిండిపోయింది.

అవునన్నట్టు తలూపి "థాంక్యూ" అన్నాడు ఆ అమ్మాయివైపు చూస్తూ.

ఆ అమ్మాయి బయటికి వెళ్ళిపోగానే "నీ భార్యతో ఈ హాస్పిటల్‌లో అడుగు పెడుతున్నప్పుడే నిన్ను చూసి గుర్తుపట్టాను. మా గురువులు నేర్పించిన 'అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!' పద్యం గుర్తొచ్చింది. నీ భార్య కేసుని ఓ ఛాలెంజ్‌గా తీసుకుని మా టీముతో కలసి విజయం సాధించాం" అంది సౌందర్య నవ్వుతూ.

"థాంక్యూ" అన్నాడు సుందర్. "ఇప్పుడు వచ్చి వెళ్ళిందే... ఆ అమ్మాయి మన బిడ్డా?" సంకోచిస్తూనే సౌందర్యని అడిగాడు సుందర్.

"కాదు... 'నా' బిడ్డ" అంది సౌందర్య గర్వంగా. ★

ముల్లంగితో... పరాటా, కూటు!

సాంబారు, పులుసులకు ఘుమఘుమలతోపాటు... మంచి రుచినీ తేవాలంటే కాసిని ముల్లంగి ముక్కల్ని వేయాల్సిందే. ఎన్నో పోషకాలనూ అందించే ఈ దుంపతో ఇంకొన్ని రుచుల్ని కూడా ప్రయత్నిద్దామా...





పొరియల్

కావలసినవి: **ముల్లంగి:** మూడు, **పసుపు:** అరచెంచా, **ఉప్పు:** తగినంత, **పచ్చిమిర్చి:** నాలుగు, **కరివేపాకు రెబ్బలు:** అయిదు, **జీలకర్ర:** చెంచా, **వెల్లుల్లి రెబ్బలు:** ఆరు, **కొబ్బరితురుము:** పావుకప్పు, **నూనె:** రెండు టేబుల్‌స్పూన్లు, **ఆవాలు:** చెంచా, **మినప్పప్పు:** చెంచా, **సెనగపప్పు:** చెంచా, **ఉల్లిపాయముక్కలు:** అరకప్పు.

తయారీ విధానం: ముల్లంగి చెక్కు తీసి చిన్న ముక్కల్లా కోసి ఓ గిన్నెలో తీసుకుని కప్పు నీళ్లు, పావుచెంచా ఉప్పు, సగం పసుపు వేసుకుని స్టవ్‌మీద పెట్టి... మెత్తబడుతున్నప్పుడు దింపేయాలి. అలాగే పచ్చిమిర్చి, సగం కరివేపాకు, జీలకర్ర, వెల్లుల్లిరెబ్బలు, కొబ్బరితురుమును మిక్సీలో వేసుకుని గ్రైండ్ చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, సెనగపప్పు వేయించుకుని ఉల్లిపాయముక్కలు, కరివేపాకు వేయాలి. ఇవి వేగాక చేసిపెట్టుకున్న కొబ్బరి మిశ్రమం, మిగిలిన పసుపు, సరిపడా ఉప్పు, ఉడికించుకున్న ముల్లంగి ముక్కలు వేసి అన్నింటినీ వేయించుకుని పొడిపొడిగా అయ్యాక దింపేయాలి.

పరోటా

కావలసినవి: గోధుమపిండి: రెండు కప్పులు, ముల్లంగి: రెండు, ఉప్పు: తగినంత, సెనగపిండి: మూడు టేబుల్‌స్పూన్లు, అల్లంతరుగు: చెంచా, పచ్చిమిర్చి తరుగు: చెంచా, కొత్తిమీర తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, దనియాలపొడి: అరచెంచా, కారం: అరచెంచా, నూనె: అరకప్పు.

తయారీ విధానం: ముల్లంగి చెక్కు తీసి తురుముకుని చెంచా ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. పావుగంటయ్యాక నీళ్లను గట్టిగా పిండి, తురుమును విడిగా ఓ గిన్నెలోకి తీసుకోవాలి. మరో గిన్నెలో గోధుమపిండి, పావుచెంచా ఉప్పు వేసుకుని నీళ్లు పోస్తూ చపాతీపిండిలా కలిపి మూత పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి సెనగపిండిని దోరగా వేయించుకుని తీసుకోవాలి. ఈ పిండిలో ముల్లంగి తురుము, అల్లం తరుగు, పచ్చిమిర్చి తరుగు, కొత్తిమీర తరుగు, దనియాలపొడి, కారం, మరికొంచెం ఉప్పు వేసుకుని అన్నింటినీ కలపాలి. ఇప్పుడు కొద్దిగా గోధుమపిండిని తీసుకుని మందంగా ఒత్తి... మధ్యలో రెండు టేబుల్‌స్పూన్ల ముల్లంగి మిశ్రమాన్ని ఉంచి అంచులు మూసి ఇంకాస్త వెడల్పుగా ఒత్తుకోవాలి. తర్వాత వేడి పెనంపైన ఉంచి నూనె వేస్తూ రెండువైపులా ఎర్రగా కాల్చుకుని తీసుకోవాలి. ఇలాగే మిగిలిన పిండినీ చేసుకోవాలి.

కూటు



కావలసినవి: **కందిపప్పు:** పావుకప్పు, **ముల్లంగి:** ఒకటి (చెక్కుతీసి చిన్న ముక్కల్లా కోయాలి), **పుట్నాలపప్పు:** రెండు చెంచాలు, **దనియాలు:** చెంచా, **మిరియాలు:** చెంచా, **బియ్యం:** చెంచా, **మెంతులు:** పావుచెంచా, **ఎండుమిర్చి:** అయిదు, **కొబ్బరిముక్కలు:** పావుకప్పు, **ఉప్పు:** తగినంత, **పసుపు:** పావుచెంచా, **చింతపండు రసం:** రెండు టేబుల్‌స్పూన్లు, **నూనె:** రెండు టేబుల్‌స్పూన్లు, **ఆవాలు:** చెంచా, **జీలకర్ర:** చెంచా, **కరివేపాకు రెబ్బలు:** రెండు.

తయారీ విధానం: కుక్కర్‌లో కడిగిన కందిపప్పు, ముల్లంగిముక్కలు వేసి కప్పు నీళ్లు పోసి మూతపెట్టి... మూడు కూతలు వచ్చాక దింపేయాలి. స్టవ్‌పైన కడాయిని పెట్టి పుట్నాలపప్పు, దనియాలు, మిరియాలు, బియ్యం, మెంతులు, ఎండుమిర్చి, కొబ్బరిముక్కల్ని వేయించుకుని ఆ తరువాత పావుకప్పు నీళ్లు పోసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఉడికిన పప్పులో పసుపు, తగినంత ఉప్పు, చేసి పెట్టుకున్న మిశ్రమం, చింతపండు రసం వేసుకుని బాగా కలిపి మరో అరకప్పు నీళ్లు పోసి స్టవ్‌మీద పెట్టి... దగ్గర అవుతున్నప్పుడు దింపేయాలి. చివరగా స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేయించి... పప్పులో వేసి కలిపితే చాలు.

ముల్లంగిని తరచుగా ఎందుకు తీసుకోవాలంటే...

ఇవీ లాభాలు

తెల్ల ముల్లంగిలో పీచుశాతం ఎక్కువ. ఇది మలబద్ధకాన్ని నివారించి, గట్‌హెల్త్‌కి మేలుచేస్తుంది. అదే సమయంలో రక్తంలోని చక్కెరస్థాయుల్నీ అదుపులో ఉంచుతుంది.

★ ముల్లంగి ద్వారా అందే... యాంటీఆక్సిడెంట్స్, పొటాషియం గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గించి, అధికరక్తపోటును కూడా తగ్గిస్తాయి.

★ తెల్లముల్లంగిలో సి విటమిన్ కూడా ఎక్కువే. ఇది రోగనిరోధకశక్తిని పెంచడంతోపాటు ఇన్‌ఫెక్షన్ల బారి నుంచి కాపాడుతుంది.

★ ముల్లంగి ద్వారా లభించే క్యాల్షియం, మెగ్నీషియం వల్ల ఎముకలూ బలంగా ఉంటాయని అంటారు వైద్యులు.


★ ఈ దుంప శరీరంలోని వ్యర్థాలను తొలగించి, కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కీలకంగా పనిచేస్తుంది.





తేడాలేంటి?


ఈ కింది బొమ్మల్లో ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?





దారి కనుక్కోండి

స్నేహితుడి పుట్టినరోజు కావడంతో కేక్ కటింగ్‌కు వెళ్లాలనుకున్నాడు కిరణ్. కానీ, వాళ్లింటికెళ్లే దారి మర్చిపోయాడు. మీరు తనకు సాయం చేయరూ!



నిజమే కదా!

రింకీ: ఏంటి పింకీ... అలా పరిగెత్తుకుంటూ వస్తున్నావు?

పింకీ: అక్కడో కుక్క మొరుగుతూ నావైపే వస్తోంది...


రింకీ: మొరిగే కుక్క కరవదని చదువుకోలేదా నువ్వు?

పింకీ: నేను చదువుకున్నా కానీ కుక్క చదువుకుందో లేదో తెలియదు కదా...

రింకీ: ఆc..!

ఎన్నెన్ని?

ప్లేస్కూల్‌లోని వర్డ్ బ్లాక్స్ అన్నింటినీ పిల్లలు గజిబిజిగా పడేశారు. వాటిల్లో ఏ అక్షరాలు ఎన్ని ఉన్నాయో లెక్కించగలరా?




జత ఏవి?

ఇక్కడున్న బొమ్మల్లో రెండు మాత్రమే ఒకేలా ఉన్నాయి. అవి ఏవో గుర్తించండి చూద్దాం.



తెలుసా... తెలుసా...

ఇక్కడున్న బొమ్మల ఆంగ్ల పేర్లలోని మొదటి అక్షరాలను కలిపితే, ఒక రాష్ట్రం పేరు వస్తుంది. అదేంటో చెప్పగలరా?



చెప్పగలరా?

పిల్లలంతా హాయిగా ఆడుకుంటున్నారు కదూ! ఈ బొమ్మలో ఆంగ్ల అక్షరం 'K'తో ప్రారంభమయ్యే అంశాలు కొన్ని ఉన్నాయి. అవేంటో చెప్పండి చూద్దాం.



సాధించగలరా?

ఇక్కడ కొన్ని అంకెలు గజిబిజిగా ఉన్నాయి. అయితే, బొమ్మలో చూపినట్లుగా- వాటిల్లో వరుసగా ఒకటి నుంచి ఎనిమిది వరకు ఉన్న అంకెలను ఒక జట్టుగా విభజించాలి. ప్రయత్నించండి మరి!

1	2	3	2	3	4	5	6	8	7	6	5
1	8	4	1	1	2	3	7	8	8	3	4
2	7	5	6	7	8	4	5	6	7	2	1
3	6	5	4	3	6	5	4	8	7	6	5
4	5	6	1	2	7	1	3	2	1	3	4
1	8	7	2	1	8	2	5	6	1	2	1
2	3	4	3	1	2	3	4	7	8	3	2
8	4	5	6	7	3	8	7	6	5	4	1
7	5	6	7	8	4	5	4	5	6	7	2
6	1	8	8	2	1	6	3	2	1	8	3
5	2	7	4	3	8	7	4	3	8	7	4
4	3	6	5	8	7	6	5	2	1	6	5

తోడేలు తిండి!

ఒక అడవిలో ఓ తెలివితక్కువ తోడేలు ఉండేది. అది ఎప్పుడూ గుంపుతో కాకుండా ఒంటరిగా తిరుగుతుండేది. దాంతో తిండి దొరక్క పస్తులుండేది. ఒకరోజు దానికో తల్లి మేకా, రెండు పిల్లలూ కనిపించాయి. పరుగున వెళ్లి మేకతో... 'ఇక మీకు నూకలు చెల్లిపోయాయి. ముందు నీ పిల్లలను తిని, ఆ తర్వాత నీ సంగతి చూస్తా' అంది. మేక ఆలోచించి... 'నిన్ను ఆపగలిగే బలం మాకెక్కడిది? చచ్చేముందు ఒకసారి ప్రార్థన చేసుకుంటాం' అని అడిగింది. సరేనంది తోడేలు. అప్పుడవి గట్టిగా 'మేఁ... మేఁ..' అని అరిచాయి. అది విని వాటికి కాపలాగా వచ్చిన వేటకుక్క పరుగున వచ్చింది. దాన్ని చూసి తోడేలుకు దడపుట్టి, అక్కడి నుంచి పరారైంది.



కాసేపటికి దానికో కోడిపుంజు కనిపించగా... 'చాలా ఆకలితో ఉన్నాను. ఈరోజు నీ పని అయిపోయింది' అంది ఆవేశంగా. 'అలాగా... అయితే నన్ను తిని నీ ఆకలి బాధ తీర్చుకో. కానీ, నన్నొక్కసారి కూయనీ..' అడిగిందా కోడిపుంజు. కుదరదని చెప్పేసింది తోడేలు. 'నా మీద నీకు నమ్మకం లేకపోతే నా తోకను నీ నోటితో గట్టిగా పట్టుకో' అంది కోడిపుంజు. 'అలా అన్నావు... బాగుంది' అంటూ అలాగే చేసిందా తోడేలు. కోడిపుంజు కొక్కొరోకో అని అరుస్తుండగా.... దాని తోకలోని ఈక ఒకటి తోడేలు ముక్కులోకి వెళ్లడంతో దానికి తుమ్ము వచ్చింది. అదే అదునుగా భావించిన కోడి... పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి దాక్కుంది. నోటికి చిక్కిన ఆహారం పోవడంతో తిట్టుకుంటూ వెళ్లిపోయింది తోడేలు. కొద్దిదూరంలో దానికి కనిపించిన ఓ గొర్రె దగ్గరికెళ్లి... 'నేను నిన్ను ఎలా తినేస్తానో తెలుసా... చర్మం, కొమ్ములతోసహా..' అంది. 'సరే... నువ్వు నోరు పెద్దగా తెరుచుకొని ఉండు. నేనే పరుగున వచ్చి నీ నోట్లో పడతా' అందది. తెలివితక్కువ తోడేలు అలాగే చేయడంతో... గొర్రె పరుగున వచ్చి బలంగా కుమ్మేసింది. ఆ దెబ్బకు తోడేలు దవడ చీలిపోయి, కుయ్యో మొర్రో అనుకుంటూ అక్కడికక్కడే కుప్పకూలింది.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. పండ్ల సంఖ్య 2. గడియారం ముళ్లు 3. పిల్లి మెడలో రింగు 4. బల్ల మీదున్న మగ్గు స్థానం 5. బంతి 6. బాబు కళ్లజోడు 7. ఎలుక 8. సోఫా రంగు.


జత ఏవి?: 3, 13

తెలుసా... తెలుసా..: MEGHALAYA (Mirror, Eraser, Grapes, Honey, Ant, Leaf, Aeroplane, Yoga, Abacus).


చెప్పగలరా?: Kite, Kettle, Knife, Keyboard, Key, Kiwi, Ketchup, Kitten.

ఎన్నెన్ని?: E-5, S-5, M-3, R-2, D-4.

సాధించగలరా?



అక్షరాలూ అనుభూతులూ...



మగ్గ సంగీతం... డాక్టర్ ఎన్.గోపి అంతరాంతర ప్రయాణం. మనిషి చేతలకు ఆధారమైన చేతులకు చేతులెత్తి దండం పెడతారు ఒక కవితలో (చేతులు). కోతల తర్వాత పొలం ఒంటరితనాన్నీ, బడి తలుపులు మూసుకున్నప్పుడు గణగణల గంట గుండె దిగులునూ.. పిల్లలు రెక్కలొచ్చి వెళ్లిపోయాక తల్లిదండ్రులు అనుభవించే ఏకాకితనంతో పోల్చడం కవికే చెల్లింది (ఒంటరి పొలం). 'నా చేతికంటిన గ్రంథాల దుమ్ము గంధపు పొడిలా మెరిసిపోతుంది... ఏ పుస్తకాన్ని పట్టుకున్నా ఆ కవిని ముట్టుకున్నట్టే ఉంటుంది' అంటారు మస్తకం నిండా పుస్తకాభిమానంతో (పుస్తకాల గది). బాల్యంలో రైలు ప్రయాణ అనుభవాలూ, భోనగిరి గుట్టతో అనుబంధాలూ, మనసులో కురిసే వానలూ... ఇలా తన జీవన యాత్రలోని అనేకానేక మలుపుల్ని కవితలుగా మెరిపించారు ఎన్.గోపి.

మగ్గ సంగీతం (కవిత్వం)
రచన: డాక్టర్ ఎన్.గోపి
పేజీలు: 157; **వెల:** రూ.200; **ప్రతులకు:** ప్రధాన పుస్తక కేంద్రాలు


దొంగ... దొంగా!



ప్రపంచం నిండా దొంగలే. డబ్బును దోచుకునేవారూ, మనశ్శాంతిని మింగేసేవారూ, మనసును కాజేసేవారూ... ఇలా రకరకాలు. అందులో సైకిలు దొంగల కథే ఇది. ఇటాలియన్ రచయిత బార్టొలినీ రచన 'బైసికిల్ థీవ్స్'కు తెలుగు అనువాదమిది. కథానాయకుడు తాను పోగొట్టుకున్న సైకిలును వెతికే క్రమంలో... దొంగల బజార్‌కు వెళ్తాడు. బోలెడంతమంది చోరులతో మాట్లాడతాడు. అసలు ప్రపంచంలో ఉన్నట్టే అక్కడా వింతవింత మనస్తత్వాలు. పుర్రెకో బుద్ధి. పొట్టకో అవసరం. సైకిలు దొరుకుతుందో లేదో తెలియాలంటే నవలను చివరి వరకూ చదవాలి. ఇదో ప్రతీకాత్మక రచన. కథలోని సైకిలు జీవితానికి ప్రతీక. ఆ దొంగల బజారు సమాజానికి నిలువుటద్దం. 'పోగొట్టుకున్నదాన్ని వెతకడంలోనే జీవిత రహస్యం ఇమిడి ఉంది' అని ముక్తాయిస్తారు రచయిత.

సైకిల్ దొంగ (నవల); **రచన:** బార్టొలినీ; **అనువాదం:** శ్రీనివాస చక్రవర్తి
పేజీలు: 104; **వెల:** రూ.120; **ప్రతులకు:** ప్రధాన పుస్తక కేంద్రాలు

నేతాజీ నాయకత్వం




'సుభాష్ చంద్రబోస్ సింహం లాంటివాడు. స్వరాజ్య సమరంలో ఆయన త్యాగాలు తరతరాలకూ స్ఫూర్తి' అంటారు సర్దార్ పటేల్ ఓ సందర్భంలో. ఆ మాటలు అక్షర సత్యాలని నిరూపించే పుస్తకం 'బోస్...విస్మృత యోధుడు'. రచయిత ప్రకాశరావు లోతైన అధ్యయనం, తార్కిక దృష్టి ప్రతి వాక్యంలోనూ ప్రతిబింబిస్తాయి. బాల్యమూ, ఉద్యమ భావాలూ, చదువులూ, ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సింహగర్జనా, వ్యూహాత్మక పర్యటనలూ... ఇలా నేతాజీ జీవితంలోని ప్రతి కోణాన్నీ తడిమారు. ఆయన ప్రేమ వృత్తాంతాన్ని స్పృశించారు. మిస్టరీగా మిగిలిన నేతాజీ నిధి రహస్యాల గురించి చర్చించారు. ప్రత్యేకంగా మహిళా దళాన్ని ఏర్పాటు చేసి స్త్రీశక్తిని గుర్తించిన తీరునూ విశ్లేషించారు.

బోస్... విస్మృత యోధుడు
రచన: పి.యస్.ప్రకాశరావు; **పేజీలు:** 192; **వెల:** రూ.220
ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫోన్: 9381559238

శ్రీనివాస ప్రపత్తి

ఈ సృష్టిలో శ్రీమన్నారాయణుడు ఒక్కడే సర్వస్వతంత్రుడూ సకల శక్తిమంతుడూ. మిగిలిన జీవరాశులన్నీ అస్వతంత్రాలే... అంటుంది వైష్ణవ ధర్మం. ఆ శరణాగతి మార్గంలోనే తాను తిరుమల తిరుపతి దేవస్థానాల ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా పనిచేశానని సవినయంగా వివరిస్తారు విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి తన అనుభవాల సంకలనమైన 'హరే శ్రీనివాసా!' పుస్తకంలో.



'శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్' ఆలోచనకు అంకురార్పణ, 'అఖండ హరినామ సంకీర్తన' అమలులో అవరోధాలు, 'కళ్యాణమస్తు' పథకానికి లోకకల్యాణ కారకుడైన శ్రీనివాసుని ఆమోదం, ఏడుకొండల స్వామిని రెండు కొండలకే పరిమితం చేస్తూ జీవో వెలువడినప్పుడు తన గుండెల్లో చెలరేగిన అలజడులు... ఇలా అనేకానేక అంశాల్ని ఇందులో ప్రస్తావించారు.

హరే శ్రీనివాసా!
రచన: డాక్టర్ కె.వి.రమణాచారి
పేజీలు: 192; **వెల:** రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

బుక్‌షెల్ఫ్

సాహిత్య సందర్భాలు
రచన: కాట్రగడ్డ దయానంద్
పేజీలు: 136; వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9490218383

సెలయేటిలో మొగ్గ సంపెంగలు
రచన: లలిత రామ్
పేజీలు: 150; వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 8558899478

శ్రీ గణేశ పురాణం (ఉపాసనా ఖండం); పేజీలు: 677; వెల: రూ.400
శ్రీ గణేశ పురాణం (లీలాఖండం-1)
పేజీలు: 587; వెల: రూ.500; అనువాదం: సున్నర్ల వెంకట్రామ శాస్త్రి
శ్రీ గణేశ పురాణం (లీలాఖండం-2)
అనువాదం: శలాక రఘునాథ శర్మ; పేజీలు: 607; వెల: రూ.500
ప్రతులకు: 8317543016

ప్రవాస సాహిత్యం; రచన: రమేష్ ప్రసాద్ రావెళ్ల
పేజీలు: 278; వెల: రూ.299; ప్రతులకు: 9949516567

శ్రీ త్యాగరాజ విజయం; రచన: సూరి వెంకటేశ్వర్లు
పేజీలు: 118; వెల: రూ.150; ప్రతులకు: 9866668824

వానలో తడవకుండా...
(21 ఉపాయాల కథలు)
రచన: సునందా కులకర్ణి
అనువాదం: ముంజులూరి కృష్ణకుమారి
పేజీలు: 104; వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

లిటిల్ రిపబ్లిక్కులుగా గ్రామాలు
రచన: డా.నాగులపల్లి భాస్కరరావు
పేజీలు: 164; వెల: రూ.150
ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ పుస్తక కేంద్రాలు

రాశి ఫలం

గ్రహబలం
(ఆగస్టు 17 - 23)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ధైర్యంగా అడుగు ముందుకేస్తారు. విధి నిర్వహణలో ఏకాగ్రత అవసరం. ఒత్తిడిని అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. వ్యాపారంలో కలిసొస్తుంది. ముఖ్య నిర్ణయాలు మేలు చేస్తాయి. అనవసర విషయాల్ని పట్టించుకోకండి. మిత్రుల సలహాలు తీసుకోండి. దుర్గమ్మను స్మరించుకోండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

మనోబలంతో నిర్ణయాలు తీసుకుంటారు. చక్కని ప్రణాళికతో విఘ్నాలను అధిగమిస్తారు. మీ ప్రతిభను సమాజం గుర్తిస్తుంది. సంప్రదింపుల సమయంలో సున్నితంగా సంభాషించండి. కాలం సహకరిస్తుంది. ఆర్థికంగా అనుకూలమైన సమయం. భూ, గృహ, వాహన యోగాలు ఉన్నాయి. లక్ష్మీదేవిని పూజించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపార విజయాలు సాధిస్తారు. ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తాయి. సామరస్య ధోరణితో వ్యవహరించండి. ఉద్యోగులు అనుకున్నది సాధిస్తారు. పెద్దల ఆశీస్సులు అందుతాయి. సమాజం మీ ప్రత్యేకతను గుర్తిస్తుంది. ఎంతోకాలం నుంచీ ఆగిపోయిన ఓ ముఖ్య వ్యవహారం కొలిక్కి వస్తుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఇష్టదేవతను ధ్యానించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

మనోబలం ముందుకు నడిపిస్తుంది. ధర్మదేవత అనుగ్రహిస్తుంది. అపార్థాలకు ఆస్కారం లేకుండా, స్పష్టంగా మాట్లాడండి. ఓర్పు అవసరం. చిన్నపాటి అవరోధాలు ఎదురైనా నిరాశపడకండి. ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నా, కృషికి తగిన ఫలితం దక్కుతుంది. లక్ష్య సాధనలో ఆత్మవిశ్వాసం అవసరం. విమర్శల్ని మనసులోకి తీసుకోకండి. నవగ్రహాల్ని పూజించండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

త్రికరణశుద్ధిగా కర్తవ్యాన్ని నిర్వర్తించండి. అంతిమ విజయం మీదే. అవకాశాలు అందినట్టే అంది చేజారిపోతాయి. కష్టాన్ని బట్టి ఫలితం ఉంటుంది. ఆలోచనలకే పరిమితం కాకుండా, ఆచరణ దిశగానూ అడుగులు వేయాల్సిన సమయం. సంభాషణల్లో సున్నితత్వం అవసరం. పరమేశ్వరుడిని ధ్యానించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపార ఫలితాలు అనుకూలం. తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. గ్రహబలం మిశ్రమంగా ఉంది. వృథా వ్యయాల్ని నివారించండి. కుటుంబ సభ్యుల సూచనలు తీసుకోండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభయోగం ఉంది. పనులన్నీ వేగంగా పూర్తవుతాయి. ఉద్యోగులు అత్యుత్తమ ఫలితాలను సాధిస్తారు. పదవీలాభం సూచితం. భాగ్య శుక్రయోగం వల్ల ఆర్థిక స్థితి బావుంటుంది. అభీష్టాలు సిద్ధిస్తాయి. సమాజం మీ ప్రతిభను గుర్తిస్తుంది. భాగ్య బృహస్పతి యోగం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. గృహ, వాహన యోగాలు ఉన్నాయి. శ్రీలక్ష్మిని ధ్యానించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

అత్యుత్తమ కాలం నడుస్తోంది. ప్రతి ప్రయత్నమూ విజయవంతం అవుతుంది. వృత్తి నైపుణ్యంతో పెద్దల ప్రశంసలు అందుకుంటారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. ప్రయత్నాలు ఒక్కొక్కటిగా కార్యరూపం ధరిస్తాయి. మంచిపనుల ద్వారా సమాజంలో పేరు తెచ్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మనోబలంతో కొత్త పనులను ప్రారంభించండి. దైవానుగ్రహం ఉంది. చంచలత్వం పనికిరాదు. వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకండి. ఇతరుల విషయాల్లో జోక్యం వద్దు. ఆత్మీయులతో చర్చించాకే ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. వారం మధ్యలో ఓ లక్ష్యాన్ని పూర్తి చేస్తారు. విష్ణు సహస్రనామం పఠించండి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మనోబలం అవసరం. కాలం కొంత వ్యతిరేకంగా ఉంది. కాబట్టి, ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. అనాలోచిత చర్యలు నష్టం కలిగిస్తాయి. ఒత్తిడికి గురిచేసేవారితో జాగ్రత్త. అర్థంలేని ఆవేశాలు తీవ్ర నష్టం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో మరింత శ్రద్ధ అవసరం. ప్రయాణాల్లో జాగ్రత్త. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

వ్యాపారంలో లాభాలు ఉన్నాయి. కొత్త ప్రయత్నాలు కలిసొస్తాయి. పరిస్థితులకు తగినట్టు నిర్ణయాలు తీసుకోండి. ధనలాభం సూచితం. సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లండి. వివాదాలకు దూరంగా ఉండండి. లౌక్యంగా సంభాషించండి. మనోబలాన్ని పెంచుకోండి. వారం మధ్యలో ఓ ఆపద నుంచి సురక్షితంగా బయటపడతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పూజించండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి


ఉద్యోగ ఫలితాలు అత్యుత్తమం. కాలం సహకరిస్తుంది. నిర్ణయాలు విజయాన్ని అందిస్తాయి. ఉద్యోగంలో ఉన్నత స్థితి గోచరిస్తోంది. సృజనాత్మకతతో అనుకున్నది సాధిస్తారు. పెట్టుబడుల విషయంలో మేలు జరుగుతుంది. కుటుంబ వ్యవహారాల్లో సంయమనం అవసరం. ప్రయాణాల్లో జాగ్రత్త. వారాంతంలో శుభం జరుగుతుంది. మహాలక్ష్మిని ధ్యానించండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. సోదరి (2)
3. చంద్రుడు (3)
6. అడ్డం 1తో అసూయ, కోపం, ఈర్ష్య (1)
7. అభిప్రాయం, తలపోత (3)
9. సంకేతం (3)
11. విరక్తి, నిరాసక్తత (3)
13. సౌమిత్రి (4)
14. పొడవాటి మెడ కలిగిన తీగ వాయిద్యం... తత్వాలు పాడేవారు ఎక్కువగా వాడతారు (3)
15. నాణ్యత లేనిది (2)
16. నాన్నకి నాన్న (2)
18. గ్రామం (2)
20. మొదట, మొదట్లో (3)
22. అడ్డం 6తో కుమార్తె (1)
23. రోజా పువ్వు (3)
25. కళేబరం (3)
27. చక్కని పలువరస కలిగిన స్త్రీ (3)
28. హారం (2)
29. పులుము, పూయు (2)
31. వినతి (3)
33. బలరాముడి తండ్రి (3)
35. రహస్య సమాలోచనలు (4)
36. లాభానికి వ్యతిరేకం (2)
37. ఒక ఆభరణం... శిరోభూషణం (3)
38. కోపం, కినుక (3)
39. బొమ్మ (2)
42. కసి, ద్వేషం (2)
43. బంధం (2)
44. గుర్రం (2)
45. జటాయువు సోదరుడు (3)
46. సంపద, లక్ష్మి (2)
47. బియ్యంలో నాణ్యమైన రకాలు (3)
48. పన్నెండు (3)



నిలువు


1. చతుష్షష్టి కళలు... అంటే ఎన్ని? (6)
2. సత్తా (2)
4. మండోదరి భర్త (4)
5. మించినది, మన అదుపులో లేనిది (3)
7. అదృష్టం (2)
8. అనారోగ్యం (3)
10. ముచ్చట్లు (3)
12. పోగు, కుప్ప (2)
16. రోడ్డు వేసేందుకు కంకర మీద పోసే డాంబర్ (2)
17. మెడలో గోల్డ్ చెయిన్ (3)
18. చిక్కుకుంటే బయటపడలేని లోతైన బురద గుంట (2)
19. పొలం (2)
21. ఆ తరువాత, ఫలానావారి జీవితకాలం దరిమిలా (5)
24. బుజ్జగింత (3)
25. ఒత్తిడి (3)
26. ఒక గ్రహం; గురుదేవుడు (3)
30. విజయం (3)
31. ఎండమావి (4)
32. వినిపించుకోకు (3)
34. అన్యాయం, అవినీతి (3)
35. శుభం, స్వస్తి (3)
38. రక్కసి (3)
39. మెచ్చుకోలు, అభినందన (3)
40. రాజభవనం, దేవిడీ (3)
41. గాలివాన (3)
45. సంధ్య వికృతి (2)

సుడొకు

	3	7		4	6		5	
						6	4	
4			5				9	3
			1		2			
8		2		7		1		6
			3		9			
3	6				1			7
	8	9						
	5		8	2		3	6	

గతవారం సమాధానాలు

పదకేళి



సుడొకు

4	6	3	1	5	9	7	2	8
1	2	8	4	7	6	5	9	3
7	5	9	3	2	8	4	1	6
3	8	6	5	9	1	2	7	4
9	7	4	2	6	3	1	8	5
2	1	5	7	8	4	6	3	9
6	3	2	9	1	5	8	4	7
8	4	7	6	3	2	9	5	1
5	9	1	8	4	7	3	6	2

A B C D E F 1 2 3


చుట్టూ నీరు... మధ్యలో ఊరు!













ఎక్కడైనా ఊళ్లోకి వెళితేగానీ తెలియదు అక్కడున్న విశేషాలేంటో. కానీ గ్రీస్ దేశంలోని ఎటొలికో అనే ఈ పట్టణం గొప్పతనమేంటో ఊరి బయటే పూర్తిగా అర్థమైపోతుంది. నీళ్ల మధ్యలో... చుట్టూ ఉన్న ప్రాంతాల్ని కలిపే మూడు వంతెనలతో ఎంతో అందంగా ఉంటుందీ చోటు. కావాలనే ఓ అమరికలో ఏర్పాటుచేసినట్టు ఉండే ఈ దీవి ఆకృతి- ఊరికి మరింత ఆకర్షణను తెచ్చిపెట్టింది. 1200 జనాభా ఉండే ఈ ఊళ్లో పురాతన కట్టడాలూ, ప్రార్థనా మందిరాలూ, మ్యూజియంలు కూడా సందర్శక ప్రాంతాలే. చేపలు పట్టడం మీదే ప్రధానంగా ఆధారపడే ఇక్కడి ప్రజలకు పర్యటకంతోనూ బాగానే ఆదాయం వస్తుందట. ఏడాదంతా ప్రకృతి ప్రేమికులెందరో బైకులూ, కార్లలో వస్తూ ఈ ఊరి చుట్టూ చక్కర్లు కొడుతూ ఆనందిస్తుంటారు!

‘అడవిలోని కొలనులూ, సరస్సులూ సరిపోలేదేమో ఏకంగా సముద్రంలోకి దిగి జలకాలాటలు మొదలుపెట్టినట్టుందీ ఏనుగు’... ‘బాబోయ్ ఇంత పెద్ద ఏనుగుని ఎక్కడా చూడలేదే’... ఈ చిత్రాన్ని చూస్తే ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో ఊహ రావొచ్చు. కానీ అసలు విషయం ఏమిటంటే... అది ఎలిఫెంట్ రాక్. పొడవైన తొండం, కళ్లూ, చెవులూ... మొత్తంగా ఏనుగు ముఖంలా ఏర్పడిన రాతిశిల అన్నమాట. ఐస్‌లాండ్‌లోని హెయ్‌మాయే దీవిలో కొన్నివందల ఏళ్ల క్రితం అగ్నిపర్వతం బద్దలవడం వల్ల ఈ ఆకృతి ఏర్పడింది. రంగులో, రూపంలో నిజమైన ఏనుగులానే కనిపించడానికి బూడిద రంగు అగ్నిశిలలే కారణమట. సందర్శకులే కాదు, నడి సముద్రంలో దీవికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ ఎలిఫెంట్ రాక్‌ని కెమెరాల్లో బంధించడానికి ఫొటోగ్రాఫర్లూ పోటీపడుతుంటారు!

